శుక్రవారం
16-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 235
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

జాబిల్లిపైకి నాసా ప్రైవేటు ల్యాండర్

వాషింగ్టన్: మానవ సహిత జాబిల్లి యాత్రకు సిద్ధమైన నాసా మరో లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించింది. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు వరుసగా ప్రయోగాలు చేస్తోంది. ఇటీవల ఓ ప్రైవేటు కంపెనీ భాగస్వామ్యంతో చేపట్టిన ల్యాండర్ ప్రయోగం విఫలమవగా.. తాజాగా మరో ల్యాండర్‌ను ప్రయోగించింది. నాసాకు చెందిన కెనడీ స్పేస్ సెంటర్ నుంచి 'స్పేస్ఎక్స్'కు చెందిన ఫాల్కర్ రాకెట్ ఈ ల్యాండర్‌ను మోసుకెళ్లింది. అన్నీ అనుకూలిస్తే చంద్రుడి కక్ష్యలో తిరిగి ఈనెల 22న జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగుతుంది. చంద్రుడి ఉపరితలంపై అధ్యయనం చేసి సమాచారాన్ని నాసాకు పంపుతుంది. తదుపరి ఆర్టెమిస్ యాత్రకు ఈ ప్రయోగం కీలకమని అమెరికా తెలిపింది.

రైలు పట్టాలపై రైతులు

పోలీస్ చర్యలను నిరసిస్తూ రైల్‌రోకో

పంజాబ్‌లో నిలిచిన రైళ్లు...దారి మళ్లింపు

టోల్ ప్లాజాల వద్ద ఆందోళన

న్యూదిల్లీ: పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధ భరోసా సహా వివిధ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు చేపట్టిన 'దిల్లీ చలో' ఆందోళన మూడోరోజుకు చేరింది. గురువారం పంజాబ్‌లో రైతులు రైలో రోకో నిర్వహించారు. 'దిల్లీ చలో' నిరసనకారులపై హరియాణా పోలీసుల చర్యను నిరసిస్తూ వారు ఈ ఆందోళనకు పిలుపునిచ్చారు. పంజాబ్‌లో వివిధ ప్రాంతాల్లో రైతులు రైలు ట్రాక్‌లపై బైఠాయించడంతో దిల్లీ -అమృత్‌సర్ మార్గంలో గురువారం కొన్ని రైళ్లను దారి మళ్లించారు. రైతులు అనేక టోల్ ప్లాజాల వద్ద ధర్నాలు కూడా నిర్వహించారు. వాహనదారుల నుంచి టోల్ వసూలు చేయవద్దని అధికారులను అడ్డుకున్నారు. భారతీయ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహన్), బీకేయూ దకుండ (ధనేర్) పంజాబ్‌లోని వివిధ ప్రాంతాల్లో నాలుగు గంటలపాటు 'రైల్ రోకో' నిరసనకు పిలుపునిచ్చాయి. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రైతులు రైలు పట్టాలపై బైఠాయించి ఆందోళన ప్రారంభించారు. సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శనలు కొనసాగాయి. ప్రధానంగా దిల్లీ-అమృత్‌సర్ మార్గంలో అనేక ప్రదేశాల్లో రైతులు రైలు పట్టాలపై కూర్చొని ఉండడంతో రైల్వే అధికారులు ఆ మార్గంలో ప్రయాణించే రైళ్లను చండీగఢ్ (దిల్లీ వైపు), లోహియాన్ ఖాస్ (అమృత్‌సర్, జలంధర్ వైపు) మీదుగా మళ్లించారు. దిల్లీ నుండి వచ్చే శతాబ్ది, షాన్-ఎ-పంజాబ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను లుధియానా రైల్వే స్టేషన్‌లో ఆపేసినట్లు రైల్వే ప్రతినిధి తెలిపారు. కాగా 'చలో దిల్లీ' కార్యక్రమంలో పాల్గొన్న రైతులపై హరియాణా పోలీసు భాష్పవాయువును ప్రయోగించడాన్ని నిరస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు అనేక టోల్ ప్లాజాల వద్ద రైతులు ప్రదర్శనలు నిర్వహించారు. వాహనదారుల నుంచి టోల్ రుసుము వసూలు చేయరాదని అధికారులను ఒత్తిడి చేశారు. దిల్లీ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్నామని భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు హర్మీత్ సింగ్ కడియన్ తెలిపారు. హోషియార్‌పూర్‌లో, జలంధర్-పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై ఉన్న రెండు టోల్ ప్లాజాల వద్ద రైతులు నిరసనలు

- మిగతా 2 లో

రాజ్యాంగ విరుద్ధం

- ముమ్మాటికీ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే
- దాతల వివరాలు ఈసీకి ఇవ్వాలి
- మార్చి 13 నాటికి ఈసీ వెబ్‌సైట్‌లో పెట్టాలి
- ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు

న్యూదిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలుగా అందే ఎన్నికల బాండ్లు ఇక చెల్లవని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని గురువారం నిలుపరించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని... వాక్-భావ వ్యక్తీకరణ-సమాచార హక్కుల ఉల్లంఘనగా పేర్కొంది. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలిచ్చింది. దీంతో సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్రప్రభుత్వానికి గట్టి ఎదురు దెబ్బ తగినట్లు అయింది. బాండ్ల రూపేణ ఆరేళ్లలో జరిగిన లావాదేవీల వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని ఎస్‌బీఐకి సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. ధర్మాసనంలో న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయి, జేడీ పార్దివాలా, మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు. ఎస్‌బీఐ తెలిపే వివరాలను మార్చి 13వ తేదీ నాటికి తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది. అజ్ఞాత బాండ్ల స్వీకరణను సమాచార హక్కు ఉల్లంఘనగా పేర్కొంది. నల్లధనాన్ని అరికట్టేందుకు ఎన్నికల బాండ్లు ఒక్కటే మార్గం కాదని వెల్లడించింది. దాతల పేర్లు గోప్యంగా ఉంచడం తగదని, అలా చేయడం ఆదాయపు పన్ను చట్టాన్ని అతిక్రమించడమే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) కింద భావ ప్రకటన, వాక్ స్వేచ్ఛలను ఈ బాండ్ల ద్వారా అతిక్రమిస్తున్నట్లు తెలిపింది. రాజకీయ పార్టీలకు విరాళాలు క్విడ్ ప్రోకోకు దారితీస్తాయని, దాతల వివరాలు రహస్యంగా ఉంచడం సమంజసం కాదని, ఈ పథకాన్ని నిలిపివేస్తున్నామని, ఇప్పటివరకు సేకరించిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. గతేడాది నవంబరులోనే ఈ కేసు విచారణ ముగియగా, తీర్పును రిజర్వులో ఉంచిన కోర్టు దానిని గురువారం వెలువరించింది. 'మేము ఏకగ్రీవంగా తీర్పునిచ్చాం. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో అభిప్రాయ భేదం వచ్చినా... చివరికి ఏకాభిప్రాయం కుదిరింది' అని సీజేఐ తెలిపారు. వ్యాపార ప్రయోజనాల కోసం ఎన్నికల బాండ్లు దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని, పాలక పార్టీలకు అనుకూలంగా లేదా క్విడ్ ప్రోకోకు దారితీసే ముప్పు ఉందని ఆయనన్నారు. ఇందుకు ఉదాహరణగా 'ఏ అనే కేవైసీ కలిగిన వ్యక్తి పేరుతో బీ అనే వ్యక్తి ఓ పార్టీకి రూ.100 కోట్ల విరాళం ఇస్తే, అతడు దాని కోసం సదరు వంద కోట్లను ఒక్కొక్కరి నుంచి కోటి చొప్పున సేకరిస్తే ఇది అక్రమమే అవుతుంది కదా' అని అన్నారు. కేవైసీ కలిగిన ఖాతాదారుల ద్వారా ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయించడం, అజ్ఞాత దాతలు ఉండటం వల్ల రాజకీయ పార్టీలతో వారి క్విడ్ ప్రోకోకు సంబంధించి ప్రశ్నలు రావని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. ఈ విరాళం ఎక్కడి నుంచి వచ్చిందనేది పార్టీకి తెలుస్తుందని, ప్రజలకు మాత్రమే తెలియదని సీజే చంద్రచూడ్ తెలిపారు. పార్టీలకు అందే నిధుల్లో పారదర్శకత కోసం 2018 జనవరి 2న అమల్లోకి వచ్చిన ఈ పథకాన్ని సవాల్ చేస్తూ ఏడీఆర్, కాంగ్రెస్ నేత జయా ఠాకుర్, సీపీఎం, మరో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల బాండ్లను ప్రారంభించడానికి ముందే ఈ పథకంపై సమగ్ర విచారణ అవసరమని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలో దీనిపై విచారించింది. సంచలన తీర్పునిచ్చింది.

ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

సుప్రీంకోర్టు తాజా తీర్పు కేంద్రప్రభుత్వానికి ఎదురు దెబ్బగా జయా ఠాకూర్ తరఫున న్యాయవాది వరుణ్ ఠాకూర్ అన్నారు. 'ఈ తీర్పు

- మిగతా 2 లో

స్వాగతిస్తున్నాం: సీపీఐ

న్యూదిల్లీ: ఎన్నికల బాండ్లు రాజ్యాంగానికి విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం అన్నారు. ఎన్నికల బాండ్ల రూపేణ సీపీఐ ఎన్నడూ నిధులు స్వీకరించలేదని తెలిపారు. 'ముందు నుంచి దానిని వ్యతిరేకించాం. సైద్ధాంతికంగానూ ఎన్నికలపై కార్పొరేట్ల ప్రభావాన్ని వ్యతిరేకించాం. ఎన్నికలపై, ఎన్నికల బాండ్లపై కార్పొరేట్ ప్రభావాన్ని ముందు నుంచి మా పార్టీ వ్యతిరేకిస్తూనే ఉంది' అని రాజా అన్నారు. బీజేపీతో ఆశ్రిత పెట్టుబడిదారుల బంధాన్ని బహిర్గతం చేసేందుకుగాను సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల రూపేణ వచ్చిన విరాళాల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గత దశాబ్దంలో బీజేపీ ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యవస్థతో

- మిగతా 2 లో

మొత్తం రూ.16,518 కోట్లు

బీజేపీకి రూ.6,564 కోట్లు

- కాంగ్రెస్‌కు రూ.1,135కోట్లు
- ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్‌కు అధికం
- ఎన్నికల బాండ్లపై ఏడీఆర్

2లో



సర్వం సిద్ధం

- నేడు గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె
- రైతు, కార్మిక సంఘాల సమాయత్తం

న్యూదిల్లీ: రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న మోదీ సర్కారుపై రైతు, కార్మిక సంఘాలు యుద్ధానికి సన్నద్ధమయ్యాయి. శుక్రవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన భారత గ్రామీణబంద్, పారిశ్రామికకు సర్వసిద్ధం చేశాయి. రైతు సంఘాలన్నీ ఏకమై భారత్ బంద్‌లో పాల్గొనాలని ఐక్య కిసాన్ మోర్చా విజ్ఞప్తి చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశవ్యాప్తంగా ప్రధాన రహదారులపై రైతులు నిరసనలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో పంజాబ్‌లోని కొన్ని రాష్ట్ర, జాతీయ రహదారులు శుక్రవారం నాలుగు గంటల పాటు మూసివేయనున్నారు. ఈ ఆందోళనకు దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలతోపాటు

- మిగతా 2 లో

రాజధాని ఫైల్స్‌పై హైకోర్టు స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శనపై ఏపీ హైకోర్టు గురువారం స్టే విధించింది. శుక్రవారం వరకు సినిమా విడుదలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. సినిమాకు చెందిన అన్ని రికార్డులు తమకు అందించాలని ఆదేశించింది. ఈ సినిమా గురువారమే అన్ని థియేటర్లలో విడుదలైంది. అయితే ఈ చిత్రంలో సీఎం జగన్, మాజీమంత్రి కొడాలి నాని, వైసీపీ ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేలా సన్నివేశాలు ఉన్నాయంటూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. వైసీపీని చులకన చేయాలనే ఉద్దేశంతోనే సినిమా తీశారని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. కోర్టులో విచారణ సందర్భంగా నిర్మాతల తరఫు న్యాయవాది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వావ్... సిక్సర్!

బాబును నమ్మితే అధోగతే

వైసీపీది ప్రజల మేనిఫెస్టో - టీడీపీది దోపిడీ...

వలంటీర్ల అభినందన సభలో జగన్

'సేవా' పురస్కారాల అందజేత

విశాలాంధ్ర-ఫిరంగిపురం: బాబును నమ్మితే అథోగతే అంటూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడిని ఉద్దేశించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ పాలన దోపిడీ రాజ్యంగా సాగిందన్నారు. తమది సంక్షేమ-ప్రజా పాలనగా వర్ణించారు. వైసీపీది ప్రజల మేనిఫెస్టో కాగా టీడీపీది దోపిడీ మేనిఫెస్టో అని వ్యాఖ్యానించారు. జగన్ గురువారం గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ సమీపంలో పీఎస్‌సీ కాలేజి వద్ద వలంటీర్ల అభినందన సభలో పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై సుదీర్ఘ

- మిగతా 2 లో

అగ్రిగోల్డ్ బాధితులకు

సీఎం జగన్ న్యాయం చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ప్రభుత్వానికి వారం రోజులే గడువు: ముప్పాళ్ల
- న్యాయపోరాట దీక్షకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సంఘీభావం
- భవిష్యత్ పోరాట కార్యాచరణపై తీర్మానాలు

2లో

అధ్యక్ష ఎన్నికల్లో గెలిచాను

ప్రబోవో సుబియాంటో ప్రకటన

అధికారికంగా వెలువడని ఫలితాలు

జకార్తా: ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినట్లు ప్రబోవో సుబియాంటో ప్రకటించుకున్నారు. 55శాతానికిపైగా ఓట్లు ప్రబోవో సుబియాంటో పొందినట్లు అనధికారిక సర్వేలు చెబుతున్నాయి. 'క్విక్ కౌంట్స్' ఆధారంగా ప్రబోవో అధ్యక్ష ఎన్నికల్లో ఈయన విజేతగా నిలిచినట్లు వెల్లడైంది. ఆయన ఇద్దరు ప్రత్యర్థులు అనీస్ బస్వేదాన్, గంజర్ ప్రనోవో మాత్రం తమ ఓటమిని అంగీకరించలేదు. ఎన్నికల సంఘం అధికారికంగా ఫలితాలు ప్రకటించేంత వరకు వేచి చూడాలని తమ మద్దతుదారులకు సూచించారు. అధికారిక ప్రకటన వెలువడేందుకు కొన్ని వారాలు పడుతుంది. భారీ వర్షం కారణంగా ఎన్నికల రోజు ఇబ్బందులు వచ్చినా ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రబోవో సుబియాంటో దేశ రక్షణ మంత్రి. తాను అధ్యక్షుడు జోకో విడొడో వారసుడిగా స్వయంగా ప్రకటించుకున్నారు. రాజధాని జకార్తాలో వేలాది మంది మద్దతుదారులనుద్దేశించి విజయ ప్రసంగం చేశారు. ఎన్నికల్లో గెలిచాం... ఈ గెలుపు ఇండోనేసియన్లది అని ఉద్ఘాటించారు. ఎన్నికల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇండోనేసియాలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, పీపుల్స్ కన్సల్టేటివ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 20,600 పదవులకు 2,59,000మంది పోటీ చేశారు. భారీ వర్షాలు, వరదలతో పోలింగ్‌కు అంతరాయాలు ఏర్పడినా ఓటింగ్ భారీగా జరిగింది. క్లిష్టమైన ఇండోనేసియా పోలింగ్ ప్రక్రియలో ఫలితాలు అధికారికంగా వెలువడేందుకు కొన్ని వారాల సమయం పడుతుంది. సుబియాంటోకు 57 నుంచి 59శాతం ఓట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే 80శాతం ఓట్ల లెక్కింపు జరిగినట్లు సమాచారం.

పీటీఐ ప్రధాని అభ్యర్థిగా ఒమర్ అయూబ్

ఇస్లామాబాద్: తమ పార్టీ ప్రధాన కార్యదర్శి ఒమర్ అయూబ్‌ను ప్రధానమంత్రి అభ్యర్థిగా పాకిస్థాన్ తెహ్రీక్- ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) నామినేట్ చేసింది. పీటీఐ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులంతా అతిపెద్ద కూటమిగా ఏర్పాటయ్యారు. 101 నేషనల్ అసెంబ్లీ స్థానాల్లో స్వతంత్రులు గెలిచినప్పటికీ గుర్తింపు పొందిన పార్టీ లేక సంకీర్ణంలో లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కుదరదు. కాబట్టి సమర్థ కూటమిగా నిలిచేందుకు మరో సంఘంతో కలవడం ముఖ్యం. పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య అవగాహన కుదిరిందని, ఈ రెండు పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన క్రమంలో తమ ప్రధాని అభ్యర్థిగా ఒబర్ అయూబ్‌ను పీటీఐ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

పీటీఐకి దెబ్బ మీద దెబ్బ : ఇమ్రాన్ ఖాన్ పార్టీ మద్దతుతో గెలిచిన స్వతంత్రులు ఒక్కొక్కరిగా ప్రత్యర్థి పార్టీల్లో చేరుతున్నారు. ఇప్పటివరకు ఐదుగురు నిష్క్రమించారు. తాజాగా పంజాబ్ ప్రావిన్షియల్ నుంచి ఎన్నికైన ముగ్గురు ప్రత్యర్థి పార్టీలోకి వెళ్లారు. దీంతో ఇమ్రాన్ ఖాన్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. పీఎంఎల్-ఎన్‌లోకి స్వత్రంతులు క్యూ కట్టారు. అసెంబ్లీకి ఎన్నికైన ఎనిమిది మంది, నేషనల్ అసెంబ్లీకి ఎన్నికైన ఒకరు ఇప్పటికే ఆ పార్టీలో చేరారు. ఫలితంగా పీఎంఎల్-ఎన్ బలం నేషనల్ అసెంబ్లీలో 80 స్థానాలకు, పంజాబ్ అసెంబ్లీలో 150కుపైగా స్థానాలకు పెరిగింది.

నేపాల్‌లో రక్తమోడిన రహదారులు

రెండు రోజుల్లో 20 మంది దుర్మరణం

ఖాట్మండు: నేపాల్‌లో రహదారులు రక్తమోడాయి. కేవలం రెండు రోజుల్లో సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. రాజధాని ఖాట్మండులో గురువారం జరిగిన బస్సు ప్రమాదంలో 10 మంది దుర్మరణం చెందారు. మొత్తం 40 మందితో వెళుతున్న బస్సు కపిలవస్తు జిల్లాలో ఓ నదిలో పడింది. 10 మంది చనిపోగా మిగతా వారికి గాయాలయ్యాయి. ఆరుగురు ప్రాథమిక చికిత్స తర్వాత డిశార్జ్ కాగా మిగతా వారు వేర్వేరు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నట్లు పోలీసు అధికారి హరి బహదూర్ ఓలీ తెలిపారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమన్నారు. అలాగే బుధవారం పల్పా జిల్లా రహదారిపై జీపు అదుపు తప్పిన ఘటనలో ఎనిమిది మంది అక్కడిక్కడే చనిపోయారు. ఇంకో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. మరో 16మందికి గాయాలయ్యాయి. ఏటా వందల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని నేపాల్ గణాంకాలు చెబుతున్నాయి.

రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రానికి ఎదురు దెబ్బ. 2018 నుంచి 2024 వరకు జరిగిన లావాదేవీలన్నింటిని బహిర్గతం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ పథకం ద్వారా అజ్ఞాతంగా సేకరించిన నిధులన్నీ ప్రజల ముందరకు రావాలి కాబట్టి జవాబుదారీతనం పెరుగుతుంది. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రజాస్వామ్యం గెలిచిందని చెప్పవచ్చు' అని అన్నారు. ఏడీఆర్‌కు తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పందిస్తూ బాండ్ల పూర్తి వివరాలు తెలపాలని ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఆ వివరాలను తమ వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి స్పష్టంచేసిందని తెలిపారు. తద్వారా ఎవరు బాండ్లు కొనుగోలు చేశారన్నది ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు తాజా తీర్పు ఓ మైలురాయి అని ఆయనన్నారు.

స్వాగతిస్తున్నాం: సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

రాజీ పడిందని, దానిని భ్రష్టు పట్టించేందుకు యత్నించిందని విమర్శించారు. స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు, నిష్పాక్షిక ఎన్నికల కమిషన్ కోసం సీపీఐ కట్టుబడి ఉన్నట్లు రాజా స్పష్టంచేశారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా వచ్చిన విరాళాల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల రూపేణ చట్టబద్ధంగా జరిగిన అవినీతి ద్వారా లబ్ధి పొందిన వారు ఎవరో ప్రజలకు తెలియాలన్నారు. ఎన్నికల బాండ్లపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టుకు ఏడేళ్లు పట్టడం దురదృష్టకరమని, భవిష్యత్‌లో ఇలాంటి జాప్యాలు జరగవని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సుల ప్రకారం ఎన్నికలకు రాష్ట్ర నిధులు, ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చను సుప్రీం తాజా తీర్పు ప్రభావితం చేయగలదన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రక్రియను నాశనం చేసేందుకు బీజేపీ అనేక ప్రయత్నాలు చేసిందని, దాతలు, విరాళాల వివరాలు వెల్లడించాలని, ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తాజాగా తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

'రాజధాని ఫైల్స్'పై హైకోర్టు స్టే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నం మురళీధరరావు తన వాదనలు వినిపిస్తూ రివిజన్ కమిటీ సూచనల మేరకు ఆయా సన్నివేశాలు తొలగించామని చెప్పారు. ఆ తర్వాతే తమకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని తెలిపారు. డిసెంబర్‌లో తమకు సెన్సార్ సర్టిఫికెట్ వస్తే వైసీపీ ఇప్పుడు హైకోర్టును ఆశ్రయించిందని చెప్పారు. ఇక హైకోర్టు ఉత్తర్వుల మేరకు అధికారులు వెంటనే రంగ ప్రవేశం చేసి 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనను మధ్యలో అడ్డుకున్నారు. విజయవాడలోని ట్రెండ్‌సెట్ మాల్‌లో అర్థాంతరంగా నిలిపివేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు చిత్రాన్ని ప్రదర్శించవద్దని థియేటర్ల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చారు. సినిమాను మధ్యలో ఆపివేయడంపై ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్లు కొని చూస్తుండగా మధ్యలో ఎలా నిలిపివేస్తారని నిలదీశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతోనే ఆపేశామని అధికారులు పేర్కొనగా, ఆర్డర్ కాపీ చూపించాలని కొందరు ప్రేక్షకులు పట్టుబట్టారు. మరోవైపు గుంటూరు జిల్లా ఉండవల్లిలో సినిమా ప్రదర్శన నిలిపివేతపై రైతులు ధర్నాకు దిగారు. రామకృష్ణ థియేటర్ వద్ద టీడీపీ నేతలతో కలిసి ఆందోళన చేపట్టారు.

రైలు పట్టాలపై రైతులు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. దోబా కిసాన్ కమిటీ (డీకేసీ) రాష్ట్ర అధ్యక్షుడు జంగ్‌వీర్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని రైతులు చోలాంగ్, హర్సే మన్సార్‌లోని టోల్ ప్లాజాల వద్ద ధర్నాలు చేశారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి, హర్యానా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇంటర్నెట్ సర్వీసుల నిలిపివేత

రైతుల ఆందోళన నేపథ్యంలో పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం వరకు ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. దీంతో పాటియాలా, సంగ్రూర్, ఫతేఘర్ సాహిబ్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఫిబ్రవరి 16 వరకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండవు. హోంమంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం పాటియాలాలోని శత్రనా, సమనా, ఘనౌర్, దేవిఘర్, బల్భేరా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు, ఖనౌరీ, మూనాక్, లెహ్రా, సునమ్, సంగ్రూర్‌లోని చజ్లీ, ఫతేగఢ్ సాహిబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేయబడతాయి.

అంబాలా, కురుక్షేత్ర, కైతాల్, జింద్, హిసార్, ఫతేహాబాద్,సిర్సా జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు, బల్క్ మెసేజ్‌లను హరియాణాప్రభుత్వం ఇప్పటికే నిలిపివేసింది.

బాబును నమ్మితే అధోగతే

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగం చేశారు. పారదర్శక పాలన అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2.55 లక్షల మంది వలంటీర్లు ఉన్నారన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ గతంలో దోపిడి సాగించిందని, ప్రతి పనికి లంచాలివ్వాల్సిన పరిస్థితి కల్పించిందని, నేడు అలాంటి దుస్థితి లేదని అన్నారు. 2019 తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో వైసీపీ విజయబావుటా ఎగురవేసిందని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో 39 లక్షల మందికి పింఛన్‌లు పంపిణీ చేయగా వైసీపీ హయాంలో 66 లక్షల మందికి పింఛన్లు అందజేస్తూ దేశానికే ఆదర్శంగా ఏపీని నిలిపామని జగన్ తెలిపారు. అనంతరం వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను ముఖ్యమంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా అమరావతి రాజధానిలోని పేదలకు ఇచ్చే పింఛన్‌ను రూ.2500 నుంచి రూ.5వేలకు పెంచాలని, ఫిరంగిపురం కార్మెల్‌మాత కొండకు ఘాట్ రోడ్ వేయాలని ముఖ్యమంత్రిని ప్రత్తిపాడు శాసన సభ్యుడు, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత కోరారు. సభలో మంత్రులు విడదల రజని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మొత్తం రూ.16,518 కోట్లు...

బీజేపీకి రూ.6,564 కోట్లు

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఇప్పటివరకు సేకరించినది ఎంత? దాతల వివరాలు బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఈ పథకం 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లో ఉంది. ఇటీవల కాలంలో కొన్ని వందల కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విక్రయించింది. అయితే ఎన్నికల బాండ్లపై నిర్ణయం తీసుకోవడంలో సుప్రీంకోర్టు తీవ్ర జాప్యం చేసింది. ఎన్నికల బాండ్లు చెల్లవని, అవి రాజ్యాంగ విరుద్ధమని ఏడేళ్ల తర్వాత తీర్పునిచ్చింది. దీంతో ఈ జాప్యం ఎవరికి లబ్ధి కలిగించిందన్న ప్రశ్న తెరపైకి వచ్చింది.

ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం రూ.16,518.11 కోట్ల విలువ చేసే ఎన్నికల బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. 2017-18 నుంచి 2022-23 వరకు రూ.12,008 కోట్ల విలువ చేసే బాండ్లలో నుంచి సుమారు 55శాతం అంటే రూ.6,564 కోట్లు బీజేపీకి వచ్చాయి. ఈ పార్టీకే బాండ్ల రూపేణ అధిక నిధులు సమకూరాయి. ఐదేళ్లలో రూ.1,135 కోట్లు (అంటే బాండ్లలో 9.5శాతం) కాంగ్రెస్‌కు లభించాయి. ఇదే కాలంలో రూ.1.095 కోట్లు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఖాతాకు చేరాయి. ఎన్నికల బాండ్లు ప్రవేశపెట్టినప్పటి నుంచి 2022-23 వరకు వచ్చిన మొత్తంలో 54శాతం అంటే రూ.2,120.06 కోట్లు బీజేపీ సమీకరించిందని 'ది హిందూ' నివేదించింది. 2018-23లో బీజేపీకి వచ్చిన మొత్తం నిధుల్లో 52శాతానికిపైగా (రూ.5,272 కోట్లు) ఎన్నికల బాండ్ల ద్వారానే సమకూరినట్లు ఏడీఆర్ (ప్రజాస్వామ్య సంస్కరణల సమాఖ్య) వెల్లడించింది.

2022-23లో కాంగ్రెస్‌కు రూ.171 కోట్లు వచ్చాయని పేర్కొంది. ఇక ప్రాంతీయ పార్టీల విషయానికొస్తే భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)కు అధిక నిధులు ఎన్నికల బాండ్ల రూపేణ సమకూరాయి. రూ.529 కోట్లు (2022-23)లో బీఆర్‌ఎస్‌కు వచ్చాయి. అలాగే టీఎంసీకి రూ.329 కోట్లు, బీజేడీకి రూ.152 కోట్లు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కురూ.52కోట్లు సమకూరాయి. 2021-22లో టీఎంసీకి రూ.528 కోట్లు రాగా డీఎంకేకు రూ.306 కోట్లు, బీజేడీకి రూ.291 కోట్లు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కు రూ.60 కోట్లు వచ్చాయి. ఎన్నికల బాండ్లు వచ్చాక జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలుగా 2019 లోక్‌సభ ఎన్నికలు నిలిచాయి. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలు కూడా ఇవేనని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. 8.7 బిలియన్ డాలర్లను రాజకీయ పార్టీలు చేసినట్లు తెలిపింది. ఇది 2014 ఎన్నికల్లో చేసిన ఖర్చుకు రెట్టింపు కన్నా ఎక్కువగా పేర్కొంది. ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి వాటికి వ్యతిరేకంగా హక్కుల కార్యకర్తలు పోరాడుతున్నారు. వారి పారదర్శకతను ప్రశ్నించారు. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ సూచనలను పట్టించుకోకుండా ఈ పథకాన్ని మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేసింది. బాండ్లు విక్రయించింది. దీంతో న్యాయస్థానాల్లో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటి విచారణలో జాప్యం కొనసాగింది. ఎట్టకేలకు ఎన్నికల బాండ్లు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ సంఘ కార్మికులు కూడా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. భారత్ బంద్ నేపథ్యంలో వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు మూతపడనున్నాయి. దీంతో పాటు రవాణా, వ్యవసాయ కార్యకలాపాలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పనులు, గ్రామీణ పారిశ్రామిక, సేవా రంగ సంస్థలు, మూతపడే అవకాశం ఉంది. భారత్ బంద్ రోజున కూరగాయలు, ఇతర పంటల సరఫరాపైనా ప్రభావం పడుతుంది. భారత్ బంద్ సందర్భంగా అంబులెన్స్, పెళ్లిళ్లు, మెడికల్ షాపులు, పాఠశాలలు, పరీక్షలు తదితర అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చాయి. అయితే పంటలకు కనీస మద్దతు ధర, కొనుగోలుకు చట్టబద్ధమైన హామీ, రుణమాఫీ, విద్యుత్ బిల్లు నిలుపుదల వంటి డిమాండ్లు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసింది. దీంతోపాటు గృహావసరాలకు, దుకాణాలకు వ్యవసాయానికి ఉచితంగా 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సమగ్ర పంటల బీమా, నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, అందుకే ఈ ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని రైతులు స్పష్టంచేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు

సీఎం జగన్ న్యాయం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: గత ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షనేత హోదాలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల 'న్యాయ పోరాట దీక్ష' విజయవాడ ధర్నా చౌక్ వద్ద గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కస్టమర్లు, ఏజెంట్లు పైసా పైసా కూడబెట్టి అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం వద్ద పెట్టటం జరిగిందన్నారు. కంపెనీ మోసానికి బలైన బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి సీఎం జగన్ మోసం చేశాడని విమర్శించారు. ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా కంపెనీ వద్ద ఉన్న వేల కోట్ల రూపాయలు ఆస్తుల్ని అమ్మి బాధితులకు చెల్లిస్తే మంచి పేరు వచ్చేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరిస్తామని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోల్లో పెట్టేలా పోరాటం చేయాలన్నారు. బాధితుల తరుపున పోరాడే పార్టీలను ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికి పోవడం ఖాయమని సర్వేలు వస్తున్నాయని చెప్పారు. మూడు నెలల తరువాత తాడేపల్లి ప్యాలెస్, ఇడుపులపాయలను వదిలేసి పక్క రాష్ట్రాల నగరాలైన హైదరాబాద్, బెంగళూరులో ఉండే పరిస్థితి వస్తుందన్నారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను బదిలీలు చేస్తున్నారని ఒక నియోజకవర్గంలో పనికిరాని వారు మరో నియోజవర్గంలో ఎలా పనికి వస్తారు? అని ప్రశ్నించారు. ఎవరు అధికారంలో ఉన్నా సమస్యలపై పోరాటం చేసి సాధించుకోవటానికి ఎర్ర జెండా పార్టీల అవసరం ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల న్యాయమైన పోరాటానికి సీపీఎం పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పేదల సంక్షేమ పథకాల కోసం రూ. రెండున్నర లక్షల కోట్లు బటన్ నొక్కి ఇస్తున్నట్లు చెబుతున్న ముఖ్యమంత్రి... కంపెనీకి ఉన్న వేల కోట్ల ఆస్తులను ప్రభుత్వం చేతిలో పెట్టుకుని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోవటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్ చెపుతున్న 'వై నాట్ 175' అనేది నిజం కావాలంటే దాదాపు 40లక్షల అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లు వచ్చేలా చూసుకోవాలని హితవు పలికారు. 12 లక్షల అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాల కోసం రూ.8080 కోట్లు అడ్వాన్సుగా ఇచ్చి కంపెనీ ఆస్తుల నుంచి జమ చేసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆ ఆస్తులను అమ్మి బాధితులకు చెల్లిస్తే ఎవరు వద్దంటారు? ప్రభుత్వం ఇస్తానంటే ఎవరు అడ్డు తగులుతున్నారు? అని ప్రశ్నించారు. కంపెనీ మోసానికి ఆత్మహత్య చేసుకున్న వారు, గుండెపోట్లకు గురైనవారు, అసహజ మరణాలు పొందిన వారికి ఆనాటి ప్రభుత్వం రూ.3లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తే తాను అధికారంలోకి వచ్చిన తరువాత రూ.10లక్షలు పువ్వుల్లో పెట్టి ఇంటికి పంపిస్తానని ఇచ్చిన మాట నేటికీ అమలు కాలేదన్నారు. ఈ నెల 6వ తేదీన దీక్ష చేస్తామని పోలీసులకు నోటీసులు ఇస్తే 14వ తేదీ రాత్రి 9.30గంటలకు అనుమతి ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మందికి నోటీసులు ఇచ్చారని 150 మందికి పైగా గృహనిర్బంధం చేశారని తెలిపారు. జగన్ ఇచ్చిన హామీకి సాక్షీభూతంగా ఉన్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్సా సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తమ నాయకుడికి ఎందుకు గుర్తు చేయటం లేదని ప్రశ్నించారు. వారం రోజుల్లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించకపోతే వైసీపీ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ పోరాటంలో భాగంగా చలో హాయ్‌ల్యాండ్ పిలుపు ఇవ్వటం వల్లే అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తిగా ఉందన్నారు. లేకుంటే ఎప్పుడో అగ్రిగోల్డ్ కంపెనీకి హాయ్‌ల్యాండ్‌కు సంబంధం లేదని చెప్పటం జరిగేదన్నారు. బాధితులకు న్యాయం చేయటం కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించాలని కోరారు. ప్రత్యేక హెూదా, విభజన హామీల అమలు సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని చెప్పే పార్టీలు హామీ పత్రం రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయ పోరాట దీక్షలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను వారి వారి మేనిఫెస్టోలో పెట్టాలని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బాధితుల సమస్యను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయాలని నిర్ణయించారు. ప్రభుత్వ స్పందనను బట్టి అన్ని స్థాయిల్లో ప్రతిస్పందించాలని తీర్మానించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈవీ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ న్యాయ పోరాట దీక్షలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు నాగలక్ష్మి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్, నవతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం, నేషలిస్ట్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు అగ్రిగోల్డ్ బాధితులకు మద్దతుగా మాట్లాడారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీఎస్.ఫణిరాజ్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బీవీ.చంద్రశేఖర్ నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, శేషుకుమార్ రెడ్డి, ఆరెల్లమ్మతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, చలసాని శ్రీనివాసరావులు దీక్షాదారులకు దండలు వేసి న్యాయ పోరాట దీక్షలను ప్రారంభించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ న్యాయ పోరాట దీక్షను నిరాహార దీక్షగా మార్చారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట నమ్మి జీవచ్ఛవాలుగా ఉన్నామంటూ ఫ్లకార్డు ప్రదర్శన సమస్య తీవ్రతకు అద్దం పట్టింది.

నాల్గో 'సారీ'!

వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు గైర్హాజర్

విచారణకు రాలేమని లేఖ

స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనర్హత పిటిషన్లపై స్పీకర్ వద్ద విచారణకు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు నాల్గవసారి కూడా గైర్హాజరయ్యారు. తాము విచారణకు హాజరు కావడం లేదంటూ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వారు లేఖ రాశారు. చీఫ్‌విప్ ప్రసాదరాజు తమకు వ్యతిరేకంగా సమర్పించిన ఆధారాలు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం చెల్లవని వారు అన్నారు. ఆయన సమర్పించిన వీడియోలు ఒరిజినల్ అని ఆయా సంస్థల నుంచి ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని వారు స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇక ఇప్పటికే మూడు సార్లు గైర్హాజరైన వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను గురువారం హాజరు కావాల్సిందిగా స్పీకర్ కార్యాలయం వారికి నోటీసులు పంపింది. అయితే విచారణ నిమిత్తం స్పీకర్ తమ్మినేని, చీఫ్‌విప్ ప్రసాదరాజు అసెంబ్లీలో సమయం ముగిసే వరకు వేచి చూశారు. కాని నాల్గవసారి కూడా గైర్హాజరు కావడంతో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

చీఫ్‌విప్ ఆగ్రహం

వైసీపీ రెబల్ ఎమ్మెల్యే ల గైర్హాజరుపై చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు స్పందించారు. శాసనసభ్యులు ఏదో ఒక సాకు చెప్పి విచారణ వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే మూడు సార్లు గైర్హాజరయ్యారన్నారు. డిస్ క్వాలిఫై చేయాలని తానే ఫిర్యాదు చేశానని, తాము మళ్లీ హాజరుకావడం లేదని స్పీకర్‌కు ఎమ్మెల్యేల లేఖ రాశారన్నారు. హాజరు కాని ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని తెలిపారు. వైసీపీ తరపున గెలిచి ఇతర పార్టీల్లో బహిరంగంగా తిరుగుతున్నారని, అంతకంటే ఆధారాలు ఏమి కావాలని అన్నారు. వైసీపీ తరపున గెలిచి సీఎంను విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

రేపే జీఎస్ఎల్వీ ఎఫ్14 ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్-శ్రీహరికోట నుంచి ఈనెల 17న జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్‌ను శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇన్సాట్ త్రీడీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం బరువు 2,275 కిలోలు. ఇది వాతావరణ అధ్యయనం, సముద్ర ఉపరితలాలపై పరిశోధన, వాతావరణ విపత్తులపై సమగ్ర సమాచారం కోసం దీనిని ప్రయోగిస్తున్నారు. దీనికి సంబంధించి గురువారం ఇస్రో శాస్త్రవేత్తలు ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించారు. రాకెట్ ప్రయోగం కౌంట్‌డౌన్ ప్రక్రియ సమయాన్ని నిర్ణయించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల ఐదు నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమై నిర్విరామంగా 27 గంటల 30 నిమిషాలు కొనసాగిన అనంతరం 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల ముప్పై ఐదు నిమిషాలు కొనసాగిన అనంతరం రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్ ద్వారా ఇన్సాట్ త్రీడీఎస్ సమాచార ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. భూమికి 36,786 కిలోమీటర్ల ఎత్తులోని జియో స్టేషనరీ ఆర్బిట్ నందు ప్రవేశ పెట్టనున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు వివరించారు.

హామీలు అమలు చేయకుండా దాడులా?

కేంద్రం వైఖరిపై రైతు నేతల ఆగ్రహం

అన్నదాతల డిమాండ్ల పరిష్కారానికి డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దేశ రాజధాని దిల్లీకి తరలివస్తున్న రైతులపై హేయమైన పద్ధతుల్లో సాయుధ దళాల చేత దాడులు చేయించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి నేతలు తీవ్రంగా ఖండించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ... రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేస్తామని ఎన్నికల్లో మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా డిమాండ్లు అమలు పరచమని కోరుతున్న రైతాంగంపై అణచివేత చర్యలకు దిగడం అమానుషమన్నారు. ఉద్యమాన్ని నిర్బంధాలతో ఆపాలనే ఆలోచన విరమించి రైతు సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం పై సాగిస్తున్న దాడిని అన్ని వర్గాల ప్రజానీకం ఖండిరచాలని, రైతుఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 16న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించాలని రైతులు, వ్యవసాయ కార్మికులకు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం అన్ని పంటలకు సీ2+50 శాతం కలిపి మద్దతు ధరల చట్టం, రైతురుణ విమోచన చట్టం, 2021లో కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు, లేబర్ కోడ్‌ల రద్దు కోసం రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఐక్యమై తీవ్ర పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసి దొడ్డిదారిన ఆ చట్టాలను అమలు చేయడం దుర్మార్గమన్నారు. లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయమని ఉద్యమిస్తున్న పంజాబ్, హరియాణా, కర్నాటక రాష్ట్రాల రైతులు దిల్లీకి రాకుండా రోడ్డుకు అడ్డంగా ఇనుప ముళ్ల కంచెలు, కాంక్రీట్ దిమ్మెలు, మేకులు నాటారని, బాష్పవాయి గోళాలు, జల ఫిరంగులతో విరుచుకు పడ్డారని... పోలీసు బలగాలతో రైతులను క్రూరంగా అణిచి వేయటానికి ప్రయత్నం చేశారని ఇంతకన్నా దారుణం మరొకటి లేదన్నారు. రైతులపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్న బీజేపీ పంచన చేరడానికి అధికార వైసీపీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు పరుగులు తీయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి విభజన చట్టం హామీలను అమలు చెయ్యకుండా ద్రోహం చేసిన బీజేపీ మద్దతు కోసం ఈ రెండు పార్టీలు వెంపర్లాడటం రాష్ట్ర ప్రజలను అవమాన పరచడమేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ముందుకు రావాలని లేకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించకపోవడం, పెట్టుబడి సాయం, పంట రుణాలు అందించకపోవడం అన్యాయమన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేలా సమగ్ర పంటల బీమా పథకం తేవాలని, సాగులో ఉన్న రైతులకే నష్టపరిహారాలు, భీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగింపు నిలుపుదల చేయాలని, భూ హక్కుల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.హరినాథ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని, బంజరు భూములకు కూడా చట్టప్రకారం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులను కాపాడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరించడాన్ని నిలుపుదల చేయాలని, కడప ఉక్కుపరిశ్రమను నిర్మించాలని, కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్ర హక్కులను కాపాడాలన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును సీపీఐ స్వాగతిస్తోందన్నారు. కార్పొరేట్ శక్తుల నుంచి రూ. వేల కోట్లు బాండ్ల రూపంలో కొన్ని రాజకీయ పార్టీలు వసూలు చేసుకుంటున్నాయన్నారు. ఆయా రాజకీయ పార్టీలు అధికారం చేపట్టాక క్విడ్ ప్రోకో కింద ఆర్థిక విధానాలను మార్చి, కోట్లాది రూపాయలు కార్పొరేట్ శక్తులు ఆర్జించేందుకు సహకరిస్తున్నాయన్నారు. పైగా పార్టీ నిధుల వసూళ్లలో పారదర్శకత లోపించిందన్నారు. ఏ కంపెనీ నుంచి ఎంత వసూలు చేశారో బహిర్గతం చేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావడం లేదన్నారు. ఆర్టీఐ యాక్ట్ కింద కూడా వివరాలు వెల్లడించడానికి సుముఖతగా లేవన్నారు. ఈ అంశాలను సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. ఇప్పటివరకు కార్పొరేట్ కంపెనీల నుంచి వసూలు చేసిన నిధుల వివరాలను బహిర్గత పరచాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తోందని, అధికార పార్టీలకు పెట్టుబడిదారులు తమ ప్రయోజనాలు ప్రోత్సాహించే అభ్యర్థుల కోసం ఈ డబ్బును వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసి ప్రజాతీర్పును తలకిందులు చేస్తున్నారని విమర్శించారు. ఇదే నల్లడబ్బుతో ఓడిపోయిన పార్టీ ప్రతినిధులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను సైతం తారుమారు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి నేపథ్యంలో ఈ తీర్పు చాలా ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా కోర్టులో సీపీఎం కూడా పిటిషన్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తికైనా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నాడో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రత్యర్థి పార్టీలపైకి ఈడీ, ఐటీ వంటి సంస్థలను ప్రయోగించి వారి దగ్గరున్న డబ్బును లాక్కోవడం, తమ పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా వదిలేసిందని పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చులో పారదర్శకత లోపించడం వల్ల శత కోటీశ్వరులు ఎంపీలు, ప్రజా ప్రతినిధులై వారికి అనుకూలమైన చట్టాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారన్నారు. దొంగడబ్బును అరికట్టగలిగితే ఎన్నికల వ్యవస్థను క్రమపద్ధతిలోకి తీసుకురావచ్చని స్పష్టం చేశారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల దీక్షకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలపై యునైటెడ్ ఫ్రంట్, అఖిలపక్షం ఆధ్వర్యంలో గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద గురువారం చేపట్టిన నిరసన దీక్షకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ వ్యవస్థాపకుడు, యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ ఎన్.దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, పది సంవత్సరాల హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాలపరిమితి ఈ ఏడాది మార్చి ఒకటితో ముగుస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు గడువు పొడిగింపునకు ప్రయత్నించటం లేదన్నారు. వారికి చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లు గుర్తుకొచ్చి నోరు మెదపట్లేదన్నారు. ప్రజల ఓట్లతో లక్షల కోట్లు సంపాదించుకుని విశ్వాసఘాతుల్లా మారారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, నేషనలిస్ట్ జనశక్తి పార్టీ నేత సురేశ్ బాబు, బీఎస్పీ నేత సిహెచ్. వాసు, ఎండీ సలీమా, ఆమ్ ఆద్మీ పార్టీ కృష్ణాజిల్లా కన్వీనర్ పరమేశ్వరరావు, నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, రెల్లి కుల సంఘం అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, మర్రి రాజా శ్రీనివాసరావు, అప్పుల వెంకటేశ్వరరావు, గోవిందరాజులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ తప్పులపై మోదీ మౌనం

మాణిక్కం ఠాగూర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం తప్పులు చేస్తూ రాష్ట్రాన్ని లూటీ చేస్తుంటే, మోదీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజులుగా బూత్ స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నామనీ, కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో ఇసుక, అక్రమ మైనింగ్ భారీస్థాయిలో జరుగుతుందంటూ కేంద్రమే నివేదిక ఇచ్చిందన్నారు. వందల కోట్లు లెక్కల్లో చూపని డబ్బు, అక్రమ మైనింగ్‌లో చేతులు మారుతున్నాయని ఆరోపించారు. దీనిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం 16 సార్లు లోక్‌సభ, రాజ్యసభల్లో మోదీ ప్రభుత్వానికి మద్దతు పలికిందని, వివిధ కీలక బిల్లుల ఆమోదంలో సహకరించిందని గుర్తుచేశారు. బీజేపీకి వైసీపీ ఎంపీల మద్దతు కావాలని, అయినా జగన్ మాత్రం రాష్ట్ర ప్రయోజనాలను అడగకుండా మోదీ ప్రభుత్వానికి మద్దతివ్వడాన్ని తప్పుపట్టారు. కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, సుంకర పద్మశ్రీ పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ విభాగాల కమిటీల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అనుబంధిత ఏపీ లీగల్ సెల్, ఎస్టీ సెల్, సేవాదళ్ విభాగాలకు నూతన రాష్ట్ర కమిటీలను నియమించారు. ఈ మేరకు వైసీపీ అధినేత, సీఎం జగన్ ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు (ప్లెయిన్ ఏరియా)కు ఎం.హనుమంత్ నాయక్, మరో అధ్యక్షుడు (హిల్ ఏరియా)కు మత్స్యరాస వెంకటలక్ష్మిని నియమించారు. వారితోపాటు అన్ని జిల్లాల నుంచి వివిధ హోదాల్లో రాష్ట్ర కమిటీలోకి చోటు కల్పించారు. వైసీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడుగా అన్నమయ్య జిల్లాకు చెందిన ఎం.మనోహర్‌రెడ్డిని నియమించారు. ఆయనతోపాటు 26 జిల్లాలకు చెందిన వారికి ఆ విభాగంలో అవకాశం దక్కింది. వైసీపీ సేవాదళ్ విభాగం అధ్యక్షుడుగా గంథం రవికుమార్‌ను, అన్ని జిల్లాల నుంచి వైసీపీ నేతలను నియమించారు.

పాలన చేతగాకే ఉమ్మడి రాజధాని అంశం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి రాజధాని మరో రెండేళ్లు కావాలని అడుగుతున్నారంటే, ఇన్నాళ్లూ గుడ్డి గుర్రాలకు ప్రభుత్వం పళ్లు తోమినట్లా? అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనానికి ఉమ్మడి రాజధాని అడుగుతున్నారా? అని నిలదీశారు. ఐదేళ్లు అధికారం ఇస్తే విభజన హామీల్లో ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేదని, ప్రత్యేక హోదా రాలేదని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీలు లేవు... పోలవరం పూర్తి కాలేదు, కనీసం జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్టులకు దిక్కులేదన్నారు. కొత్త పరిశ్రమలు లేవు... ఉన్నవి ఉంటాయో లేదో తెలియదని, రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి అప్పులాంధ్రప్రదేశ్ చేశారే తప్పా, అభివృద్ధి చూపలేదని విమర్శించారు. మోదీకి మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారేగానీ విభజన హామీలపై ఏనాడూ నోరు విప్పలేదన్నారు. ఆంధ్రుల రాజధాని ఎక్కడా అని అడిగితే పదేళ్ల తర్వాత కూడా హైదరాబాద్ వైపు చూపించే దయనీయ పరిస్థితి అని, చంద్రబాబు అమరావతి పేరుతో చూపించింది గ్రాఫిక్స్ అయితే, మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాటాడారని ధ్వజమెత్తారు. పూటకో మాట, రోజుకో వేషం వేసే వైసీపీ నేతల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్రలో భాగమే ఉమ్మడి రాజధాని అంశమని పేర్కొన్నారు. ఓటమి ఖాయమని తెలిసి ప్రజలను తప్పుదారి పట్టించడం తప్ప వైసీపీకి రాజధానిపైన, రాష్ట్ర అభివృద్ధిపైన చిత్తశుద్ధి లేదన్నారు.

టీడీపీకి కిశోర్ చంద్రదేవ్ గుడ్ బై

విశాలాంధ్ర, కురుపాం/పార్వతీపురం: టీడీపీకి కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్ గుడ్ బై చెప్పారు. ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. పార్టీ వీడుతున్నట్టు అధ్యక్షుడు చంద్రబాబుకు గురువారం బహిరంగ లేఖ రాశారు.తాను మెంబర్‌గా ఉన్న యూపీఏ క్యాబినెట్ ఆమోదం పొందిన ప్రత్యేక కేటగిరి హోదా పొందాలనే ఆశతో మీరు ఎన్‌డీఏలో చేర్చిన సమయం గుర్తుండే ఉంటుంది. పార్లమెంట్‌లో చర్చలు జరిగినప్పుడు ప్రతిపక్షాల డిమాండ్‌లో ఈ అంశం కూడా ఒకటి. యూపీఏ వ్యతిరేక తరంగాలను అధిరోహిస్తూ ఎన్డీఏ అధికారంలోకి దూసుకెళ్లింది. యువతకు కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామన్న వాగ్దానం కలగానే మిగిలింది. నోట్ల రద్దు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసింది. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడిన నాయకుడు తనకు తానుగా నిరంకుశ పాత్ర వహించాలని నిర్ణయించుకున్నాడు. ఎజెండాలో ఉన్న ఏకైక అంశం రాజ్యాంగ చట్రాన్ని కూల్చివేసి కొత్త హిందూ మతతత్వ రాజ్యాన్ని సృష్టించడం. రిపబ్లిక్ అనేది రాజ్యాంగం ద్వారా వేయబడిన పునాదిపై నిర్మించిన ఉప జాతీయుల రాజకీయ సంస్థ. మతం, భాష, ప్రాంతీయవాదం, కులతత్వం విభజన కారకాలు. భిన్నత్వం మధ్య ఐక్యత మన రాజ్యాంగానికి హాల్ మార్క్ నీతి. న్యాయ వ్యవస్థ నిస్సహాయత, పతనం, రాజ్యాంగ యంత్రాంగం ఎంతవరకు విచ్ఛిన్నమైందో తెలిపే కొన్ని ఉదాహరణలు.

సింహం దాడిలో యువకుడి మృతి

విశాలాంధ్ర-తిరుపతి: సింహం దాడిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఇది. వివరాలివి. నగరంలోని ఎస్వీ జూపార్క్‌లో గురువారం ఓ యువకుడిపై సింహం క్రూరంగా దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అప్రమత్తమైన సిబ్బంది అందరినీ బయటకు పంపించి వేశారు. కొత్తగా వచ్చేవారికి అనుమతి నిరాకరించారు. కాగా, సెల్ఫీ దిగడం కోసం నిబంధనలు ఉల్లంఘించి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లడంతో సింహం దాడి చేసినట్లు తెలిసింది. సింహం ముందు ఆ యువకుడు తొడ కొట్టాడనీ, క్రూర మృగంతో పరాచికాలు ఆడి చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. సింహం బారి నుంచి తప్పించుకునేందుకు ఆ యువకుడు చెట్టు ఎక్కినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపీఎస్ పునరుద్ధరణకు మరో ఉద్యమం

18న చలో విజయవాడకు పిలుపు

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విపక్షాలకు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ కోసం ఈనెల 18న చలో విజయవాడకు ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) పిలుపు నిచ్చింది. ఈ మేరకు 'చలో విజయవాడ ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్లను రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యపట్టణాలు, మండలాల్లో సీపీఎస్ అసోసియేషన్ నేతలు గురువారం ఆవిష్కరించారు. విపక్షాల నేతలకు విజ్ఞప్తులు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ఎంతో కాలంగా తాము కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలన్న ప్రధాన డిమాండ్‌తో ఉద్యమం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. సీపీఎస్ రద్దు విధానాన్ని పక్కనబెట్టి, గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తెచ్చిందని ఉద్యోగులు మండిపడుతున్నారు. తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని, లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల అతి తక్కువగా 6,100 పోస్టులతో డీఎస్సీ ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. వయోపరిమితి పెంచకుండా జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసగించిందని తూర్పారబడుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంతో ఇదే చివరి ఉద్యమమని హెచ్చరిస్తూ కృష్ణాజిల్లా పెదపారుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రాష్ట్ర జనరల్ సెక్రటరీ సీఎం దాస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ, గ్రామ, వార్డు సచివాలయ, వైద్యారోగ్యశాఖ తదితర అన్ని విభాగాల నుంచి సీపీఎస్ ఉద్యోగులు పెద్దఎత్తున విజయవాడకు తరలిరానున్నట్టు చెప్పారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిందనీ జిల్లాల వారీగా సీపీఎస్ యూనియన్ నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలకు ముందస్తుగా నోటీసులు జారీజేసేందుకు సిద్ధమైందన్నారు. అవసరమనుకుంటే కేసులు నమోదు చేయాలని చూస్తోందన్నారు. ఎక్కడికక్కడే ఇంటిలిజెన్స్ పోలీసులు ఉద్యమకారుల కదలికలపై నిఘా ఉంచారన్నారు.

సజ్జల రెండు ఓట్లపై చర్యలు తీసుకోండి

కేంద్ర ఎన్నికల సంఘానికి అచ్చెన్నాయుడు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి రెండు ఓట్లు ఉండటంపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. రెండు ఓట్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవా లని కోరారు. రాష్ట్రంలో అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేరుస్తూ... ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లు తొలగించడంపై ఎన్నికల సంఘానికి అనేకమార్లు ఫిర్యాదు చేశామని, అయినా కొంతమంది డీఈఓలు, ఈఆర్ఓలు లెక్కచేయకుండా అధికారపార్టీతో కుమ్మక్కై వారి డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించలేదని విమర్శించారు. సీఎం జగన్ రెడ్డికి సజ్జల అత్యంత సన్నిహితుడని, ఆయన కేబినెట్ ర్యాంకు హోదాలో ఉన్నారని, సజ్జల కుటుంబానికి రెండు ఓట్లు ఉండటం ఓటర్ జాబితాలోని అవకతవకలకు తాజా ఉదాహరణ అని చెప్పారు. సజ్జల కుటుంబానికి మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాలలో ఓట్లు ఉన్నాయని వివరించారు. వాటికి సంబంధించిన ఆధారాలను లేఖతో జతచేశారు.

ఎర్ర చందనం మాఫియాపై గవర్నర్‌కు ఫిర్యాదు

రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు, ఎర్రచందనం స్మగ్లర్లతో అధికారపార్టీ నేతల సంబంధాలపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుంటూ ప్రతిపక్షాలు ప్రశ్నించకుండా దాడులు చేస్తోందని, వైసీపీ నేతల ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని వివరించారు. ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను అడ్డుకున్న అన్నమయ్య జిల్లా చిన్నపల్లె గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కె.గణేష్‌ను సైతం కారుతో ఢీకొట్టి చంపారని తెలిపారు. ఎర్ర చందనం స్మగ్లర్ విజయానంద రెడ్డిని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా నియమించటమే కాకుండా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు నుంచి బరిలోకి దింపేందుకు అధికార పార్టీ ఆలోచిస్తుందని తెలిపారు.గవర్నరును కలిసిన వారిలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం తదితరులు ఉన్నారు.

సీఎం కుర్చీలో కూర్చోలేదు

మంత్రి అమర్నాథ్ స్పష్టీకరణ – టీడీపీపై విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చొని సమీక్ష చేశారంటూ వచ్చిన ఆరోపణలను మంత్రి గుడివాడ అమర్నాథ్ తోసిపుచ్చారు. తాను సీఎం కుర్చీలో కూర్చోలేదని వివరణ ఇచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబులా కుర్చీ లాక్కునే రకం కాదని వ్యాఖ్యానించారు. సచివాలయం సమావేశ మందిరంలో కూర్చున్నానే తప్ప ముఖ్యమంత్రి కుర్చీలో కాదని అమర్నాథ్ స్పష్టం చేశారు. రూ.5వేల కోట్లు విలువైన పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను వర్చువల్‌గా చేసేందుకు సెక్రటేరియట్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి బిజీగా ఉండటంతో ఈ బాధ్యతను తనకు అప్పగించారని అమర్నాథ్ చెప్పారు. విశాఖలో ఉడా చిల్డ్రన్ థియేటర్ వద్ద వాలంటీర్ల సత్కార కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఈ అంశంపై మంత్రి వివరణ ఇచ్చారు. అదే సమయంలో తనపై విమర్శలు గుప్పించిన టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రను దుయ్యబట్టారు. ఆయన బహుశా చంద్రబాబుని ఉద్దేశించి మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని, కుర్చీని లాక్కున్న దుర్మార్గుడు చంద్రబాబు అని అన్నారు. టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు చంద్రబాబు కూర్చున్న కుర్చీలో ధూళిపాళ్ల కూర్చో లేదా? చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు అసెంబ్లీకి వచ్చిన బాలకృష్ణ ఎక్కడ కూర్చున్నారు? ధూళిపాళ్లకి ఇంగిత జ్ఞానం లేదా? అని ప్రశ్నించారు. జగన్ ఏం చెబితే అది చేస్తానని ఎన్నికల్లో సీటుపై అమర్నాథ్ చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి తనకు ప్రాంతీయ ఉప సమన్వయకర్త హోదా కల్పించారని చెబుతూ పదవి లేకుంటే రాజకీయాల్లో లేనట్టా అని ప్రశ్నించారు. అదే సమయంలో వాలంటీర్ల వ్యవస్థను ప్రశంసించారు. ఇది పటిష్ఠ వ్యవస్థ అని దేశంలో ఎక్కడా లేదని అన్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేర్చేందుకు వాలంటీర్ల వ్యవస్థను జగన్ ఏర్పాటు చేశారన్నారు. కోవిడ్ కాలంలో అందించిన సేవలకుగాను సన్మానాలందుకున్న వాలంటీర్లను మంత్రి అభినందించారు.

రైతులపై లాఠీఛార్జ్ పాశవికం: చిట్టిపాటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: న్యాయమైన డిమాండ్ల సాధనకు దిల్లీ దగ్గర ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు జరిపిన పాశవిక లాఠీఛార్జ్‌ను ఖండించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో కోరారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని, ఎంఎస్‌పీ చట్టం చేయాలని, మోదీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రైతాంగం లక్షలాదిమంది నిరసన ప్రదర్శనను చేపట్టగా పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్ జరిపారన్నారు. డ్రోన్లతో భాష్ప వాయువులను ప్రయోగించిందని, చెవులు చిల్లులు పడేవిధంగా సోనిక్ ఆయుధాల ప్రయోగం చేసిందని మండిపడ్డారు. రైతులను అడ్డుకొనేందుకు ముళ్ల కంచెలు, భారీ సిమెంటు దిమ్మెలను కేంద్రం ప్రయోగించి రోడ్లపై భారీ గోతులను తవ్వి ట్రాక్టర్లు రాకుండా ఇనుప సీలలను నాటిందన్నారు. కేంద్రం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా రైతులు ఛేదించుకుని దిల్లీ సరిహద్దులకు చేరుకున్నారని వివరించారు. పోలీసులు చేసిన పాశవిక చర్యతో అనేకమంది రైతులు గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా మద్దతు ధరల చట్టం చేయకపోతే దిల్లీలో నిరసనకు దిగుతామని రైతులు చెబుతూ వచ్చారన్నారు. అయినా విజ్ఞాపనను మోదీ ప్రభుత్వం పెడచెవిన పెట్టి వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల పరంచేయాలన్న దుర్బుద్ధితో రైతులపై దుర్మార్గమైన దాడికి పూనుకుందన్నారు. ఒకవైపు చర్చలకు పిలుస్తూనే, మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కనీస మద్దతు ధరల కమిటీలో రైతు ప్రతినిధులను నియమించకుండా అనుకూల వ్యక్తులను నియమించుకుని రైతాంగానికి తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. నిర్బంధాన్ని ఆపి తక్షణమే రైతాంగంతో చర్చించాలని కోరారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, గత ఉద్య మంలో మరణించిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ADVANCE PESTICIDES,D.No. 75-11, MMR Complex, Besides Lorry Stand, Bhavanipuram, Vijayawada- 520012

ADVANCE PESTICIDES వారి తరఫున రైతులకు మరియు వ్యవసాయ శాఖ వారికి దిగువ తెలిపిన 100%నీటిలో కరిగే మిశ్రమ ప. భా.పో ఎరువులు ADASCA కంపెనీచే తయారు చేయబడినవి. మరియు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ గెజిట్ ఆర్డర్ నె. 2900(E) తేదీ 24 అక్టోబర్ 2015 నిబంధనలకు లోబడి త్వరలో అమ్మకము చేయదలచుకున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

Potassium Metaphosphate dimer (00:40:40)	NPK 13.00.45 with Mironutrients
NPK 30.10.10 with Mironutrients	NPK 00.60.20 with Mironutrients
Potassium Chloride	NPK 05.45.05 plus 8 Zn with Mironutrients
NPK 15.45.15 with Mironutrients	NPK 00.55.18 plus 7 Mg with Mironutrients
NPK 10.26.26 with Mironutrients	NPK 00.57.20 plus 7 Ca with Mironutrients
NPK 12.61.00 with Mironutrients	NPK 00.09.46 with Mironutrients

NPK 00.38.38 plus 6 Zn with Mironutrients

మరిన్ని వివరముల కొరకు: 8087014111, Emial- info@advancepesticides.com

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
దేవదాయ ధర్మదాయ శాఖ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానము, సోమశిల గ్రామము, అనంతసాగరం మండలం
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

టెండర్ ప్రకటన

పై దేవస్థానము ప్రాంగణము ముందు నూతనముగా 5 అంతస్థుల రాజగోపురం నిర్మాణము చేయుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచి వున్నారు, ఆసక్తి కలిగినవారు క్రింది వెబ్‌సైట్ నందు టెండర్ వివరములు చూడవచ్చును. వెబ్‌సైట్ అడ్రస్: https://tender.apeprocurement.gov.in// అను వెబ్‌సైట్ టెండర్ వివరములు చూడవచ్చును.

ఇట్లు: ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సంపాదకీయం

గుప్త విరాళాలకు చెల్లు చీటీ

రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో దాపరికం లేకుండా చేస్తామన్న ఉద్దేశంతో 2017లో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఎట్టకేలకు గురువారం తేల్చేసింది. ఈ బాండ్లు ప్రవేశ పెట్టిన కొద్ది రోజులకే వీటిని సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు జయా ఠాకూర్, సీపీఐ(ఎం), స్వచ్ఛంద సంస్థ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్ విచారణ జరుగుతున్న సమయంలోనే గత జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఎదురు బెదురు లేకుండా మరోసారి ఎన్నికల బాండ్లు జారీ చేసింది. రాజకీయ పార్టీలకు అందే విరాళాలలో దాపరికం ఉండకూడదన్న మిషతో ప్రవేశ పెట్టిన ఈ బాండ్లలో ఉన్నదే దాపరికం. భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) అమ్మే ఈ బాండ్లను ఎంత మొత్తానికి ఎవరు కొన్నారన్న విషయం తెలియకుండా ఉండడం ఈ బాండ్లలో ఉన్న వికృత వ్యవహారం. ఎంత మొత్తానికి బాండ్లు కొనాలి అన్న విషయంలోనూ పరిమితి లేదు. ఈ వివరాలు తెలిసేది ఆ బాండ్లు విక్రయించిన ఎస్‌బీఐకి మాత్రమే. ఆ బ్యాంకుకు తెలిసిందంటే అధికారంలో ఉన్న ప్రభుత్వానికి తెలుసుకోవడం పెద్ద పనికాదు. ఈ అంశాన్ని విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు గత సంవత్సరం చివరలో మూడు రోజులపాటు వాదోపవాదాలు విని నవంబర్ రెండున తీర్పు వాయిదా వేసింది. విచారణ చేపట్టడానికే అపరిమితమైన జాప్యం చేసిన సుప్రీంకోర్టు గురువారం ఇవి చెల్లవని, రద్దు చేయాలని ప్రకటించినందుకు ఆనందించవలసిందే. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయి, జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన అయిదుగురు న్యాయమూర్తుల బెంచి ఈ తీర్పు చెప్పింది. తీర్పు ఏకగ్రీవమే అయినా ఇందులో రెండు భిన్న దారులు కనిపిస్తాయి. నిర్ధారణ మాత్రం ఒక్కటే. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని 19 (1) ఎ అధికరణకు, సమాచార హక్కుకు కూడా విరుద్ధమని న్యాయమూర్తులు తెలియజేశారు. బాండ్లకు వ్యతిరేకంగా ప్రధానంగా కొన్ని అంశాల మీద కోర్టు అభిప్రాయం వెల్లడించింది. బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకం, సమాచార హక్కుకు వ్యతిరేకమైనవి మాత్రమే కాదని ఇందులో ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం ఉండొచ్చునని న్యాయమూర్తులు నిర్ధారించారు. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలన్నీ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడానికే కాకపోయినా కొన్ని విరాళాలు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడానికే ఇచ్చినవీ కావొచ్చు అని కోర్టు భావించింది. విద్యార్థులు, రోజు కూలీలు కూడా తాము అభిమానించే పార్టీకి తృణమో పణమో విరాళంగా ఇవ్వొచ్చు. ఈ బాండ్లను జారీ చేసిన ఎస్‌బీఐ ఈ పనిని తక్షణం ఆపేయాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ విరాళాలు ఏయే పార్టీలకు అందాయో ఎస్‌బీఐ. ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని కూడా ఉత్తర్వు చేశారు. నల్లధనాన్ని అదుపు చేయడానికి ఈ బాండ్ల పథకం ప్రవేశ పెట్టామన్న ప్రభుత్వ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వ్యాపార సంస్థలు ఇచ్చే విరాళాలు కేవలం వ్యాపార లావాదేవీలు అయి ఉండొచ్చునన్న తీవ్ర వ్యాఖ్య కూడా చేసింది. కంపెనీల చట్టంలోని 182 వ సెక్షన్‌ను సవరించి వాటిని కూడా వ్యక్తుల కింద జమకట్టడం ఏకపక్షమైన నిర్ణయం అని కూడా న్యాయమూర్తులు అన్నారు. నల్ల ధనాన్ని అరికట్టడానికి బాండ్లు ఒక్కటే మార్గం కాదు. ఇంకా అనేక మార్గాలు ఉంటాయని న్యాయమూర్తులు గుర్తు చేశారు. ఏమైతేనేం నగదు బదులు బాండ్ల రూపంలో విరాళాలు అందజేయడంవల్ల దాపరికం ఉండదన్న ప్రభుత్వ వాదన ఈ తీర్పుతో తుత్తినియలు అయి పోయింది.

ఈ గుప్త విరాళాలు బీజేపీ ఖజానాలోకే అత్యధికంగా చేరడం చూస్తే వీటిని ప్రవేశ పెట్టడంలో మర్మం ఏమిటో అర్థమై పోతుంది. 2017-18 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో బాండ్ల రూపంలో రూ.12,008 కోట్లు సమకూరితే అందులో బీజేపీకి సమకూరిన మొత్తం రూ.6,564 కోట్లు. అంటే 55 శాతం విరాళాలు బీజేపీకే అందాయి. కాంగ్రెస్‌కు కేవలం రూ.1,135 కోట్లు అందాయి. అంటే 9.5 శాతం మాత్రమే. ప్రాంతీయ పార్టీలకు దండిగానే బాండ్ల రూపంలో విరాళాలు ముట్టాయి. తృణమూల్ కాంగ్రెస్ రూ. 1.096 కోట్లు దక్కాయి. కేసీఆర్ నాయకత్వంలోని భారతీయ రాష్ట్ర సమితికి 2022-23లో అన్ని ప్రాంతీయ పార్టీలకన్నా ఎక్కువగా రూ.529 కోట్లు అందాయి. 2021-22లో తృణమూల్‌కు రూ.528 కోట్లు, డీఎంకేకు రూ.306 కోట్లు, బిజూ జనతాదళ్‌కు 291 కోట్లు, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌కు రూ.60 కోట్లు అందాయి. ఇవన్నీ ఈ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే అందాయంటే ఈ విరాళాలలో ఏదో మతలబు ఉన్నట్టే. బాండ్లు మొదలైనప్పటి నుంచి దాదాపుగా ఇదే ధోరణి కొనసాగింది. ప్రభుత్వం ఏదైనా వ్యాపారస్థులకు అనుకూలమైన విధానాలే రూపొందిస్తున్నదని, వారి అండదండలతోనే పాలన కొనసాగుతుండడం కాదనలేని సత్యం. 2022-23లో జారీ చేసిన బాండ్లలో 90శాతం బీజేపీ ఖజానాకే తరలిపోయాయని ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ సుప్రీంకోర్టుకు సమర్పించిన ప్రమాణ పత్రంలో పేర్కొంది. 2022-23లో బాండ్ల ద్వారా రూ. 850.438 కోట్లు వసూలు అయితే అందులో బీజేపీది రూ. 719.858 కోట్లతో అతి పెద్ద వాటా. ఈ బాండ్లు ప్రవేశ పెట్టిన దగ్గరి నుంచే దాపరికంలేని హక్కులుండాలని పోరాడే సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. వీటిని ప్రవేశ పెట్టినప్పుడు రిజర్వు బ్యాంకు అభ్యంతరాలను మోదీ ప్రభుత్వం పట్టించుకోనే లేదు. వీటి గురించి ఏ చర్చకూ అవకాశం ఇవ్వకుండా మోదీ సర్కారు ఈ గుప్త విరాళాల పద్ధతి అమలు చేసింది. బాండ్లకు వ్యతిరేకంగా ఏ ఆందోళన వ్యక్తం అయిందో సుప్రీంకోర్టు తీర్పు వాటన్నింటినీ ధ్రువపరిచింది. భారీ మొత్తంలో విరాళాలు ఇచ్చిన వ్యాపార సంస్థలు, కార్పొరేట్ సంస్థలు కడకు కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు తమ చేతికి ఎముక లేనట్టుగా బీజేపీ ఖజానా నింపేశాయి. ఎన్నికల్లో డబ్బు వెదజల్లడం రాను రాను విపరీతంగా పెరిగిపోతోంది. 2014 ఎన్నికలలో పెట్టిన ఖర్చు కన్నా 2019 ఎన్నికల ఖర్చు రెట్టింపు అయింది. ఎన్నికల సమయంలో డబ్బు సంచులు గుమ్మరించడం పరిపాటి అయింది. ఇంకా నగదు రూపంలోకి మారని బాండ్లను వెనక్కు ఇచ్చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించడం విచారణలో జరిగిన జాప్యానికి పరిహారం అనుకోవాల్సిందే.

వ్యవస్థ పయనం ఎటువైపు

రా బావ చాలా రోజులయింది. ఎవరినో తిట్టుకుంటూ వస్తున్నావు. ఎవర్ని తిడితే ఎవరూరుకుంటారు. నన్ను నేనే తిట్టుకుంటున్నా. ఎందుకయ్యా అంత ఇబ్బందేమి కలిగిందిపుడు. లేకేమయ్యా తాపీగా కూర్చుని అడుగుతావు. నీకున్నంత నిగ్రహ శక్తి నాకు లేదయ్యా. సరేలె యిపుదేమయింది. అసలు విషయం చెప్పు. ఏంటి చెప్పేది. అసలు వ్యవస్థ సర్వ నాశనం అవుతోంది. మన దేశం ఎటు పయనిస్తోందో నాకు అర్థ ం కావడం లేదు. మాటలు నేర్చిన మనిషి యితరులతో కలిసి ఒక సమాజాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తరువాత మనుగడ కోసం ఒక మంచి వ్యవస్థ రూపొందించుకున్నాడు. అనంతరం ఒక మంచి ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్రజల కోసం ప్రజల చేత ప్రజలే పరిపాలన చేసే విధంగా ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకొని అభివృద్ధి వైపు వ్యవస్థ పయనించే లాగ మనుగడ సాగించె దిశలో నాయకుల స్వార్థం వల్ల యిప్పుడు వ్యవస్థ నియంతృత్వం దారికి మల్లింది. ఇప్పుడు చెప్పు బాధ కలిగించే విషయం కాదా నన్ను నేను తిట్టుకోక ఏం చేయాలి. చాలామంది బయటకు చెప్పుకోలేక లోలోపల బాధపడతారు. నేను ఆపుకోలేక

నీ దగ్గర బయటపడి బాధను వ్యక్తం చేస్తున్నా. ఎందుకయ్యా కామ్రేడ్ లెనిన్ లాగ ఒక ఎత్తయిన స్టూలు తీసుకుని అన్ని సెంటర్లలో చెప్పవయ్యా. ఇప్పుడు లెనిన్‌లా బజరాకెడితె రేపటికి మిగలనయ్యా. అన్నీ తెలిసి నన్ను ఎగతాళి పట్టిస్తావెందుకు. అదిసరే నాయకుల మీద పడ్డావు వాళ్లేం చేస్తారయ్యా. ఏం చేయాలి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని సమస్యలు పరిష్కరించడానికి నాయకుని ఎన్నుకుంటే వాళ్ల ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచి నియంతలుగా మారుతున్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడ్డాయి. గతంలో కమ్యూనిస్టుల్లో ఒక నాయకుడు చనిపోతే పది మంది ఆ స్థాయి కలవారుండేవారు. ఇప్పుడు ఒక శాససభ్యుడు తప్పు చేశాడని అతన్ని మారిస్తే మరొకడు కనిపించక యితర నియోజక వర్గం నుంచి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆయా నియోజక వర్గం మొత్తం తెలిసిన వాడు శాసనసభ్యుని తరువాత మరొకడు కన్పించడం లేదు. మండల స్థాయికే పరిమితమవుతున్నారు. అంటే ద్వితీయ శ్రేణి నాయకులు కరువవుతున్నారు. అందుకు కారణం స్వార్థమే మరి. తనతో పాటు మరొకడు ఎదగడం ఆయా శాసనసభ్యునికి యిష్టం ఉండదు. అంతేకాక మండల స్థాయి నాయకులు యితర మండలాల్లో జోక్యం చేసుకోకూడదు. ఎక్కడి వారు అక్కడే సంపాదించుకోవాలి. నిజమేనయ్యా ఒక పార్లమెంటు సభ్యుడు దేశంలోని ఎక్కడి సమస్య అయినా అలాగే ఒక శాసన సభ్యుడు రాష్ట్రంలోని ఎక్కడి సమస్య పైనైనా చర్చించవచ్చు. పోరాడవచ్చు. కాని ప్రస్తుతం అలా జరగడం లేదు. ఆయా నియోజక వర్గానికి పరిమితమవుతున్నారు. అలాగే మండల స్థాయి వారు, గ్రామస్థాయి నాయకులు ఎక్కడి వారు అక్కడికే పరిమితమవు తున్నారు. ఇప్పుడు చెప్పు బావా దేశం ఎటువైపు నడుస్తోంది. నాయకుల స్థాయి, సేవలు పరిమితమవుతున్నాయి. అధినాయకుని మాట, శాసనసభ్యులు వారి మాట ద్వితీయ శ్రేణి నాయకులు వారి మాట తృతీయ శ్రేణి నాయకులు ఏమాత్రం ఆలోచించకుండా తు.చ తప్పకుండ పాటించాల్సిందే. అందువల్ల మనిషి మేధస్సు వికసించ కుండా కుంచించుకుపోతోంది. దీనివల్ల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఇదంతా గమనించిన యువత నియంతృత్వ రాజకీయాలు నచ్చక రాజకీయాల్లో అడుగుపెట్టకుండా ఉద్యోగాల వైపు మళ్లుతున్నారు. ఇదంతా గమనించి భవిత అంథకారమవుతోందని తెలిసి ఏమీ చేయలేక నన్ను నేను తిట్టుకుంటున్నా. ఇప్పుడు చెప్పు. నన్ను ఏం చేయమంటావో. నిజమేనయ్యా ఎవరిని ఎదిరించాలో కూడా తెలియడం లేదు. ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో మేధావులు మౌనం పాటిస్తున్నారు. ఈ స్థితిలో పిల్లి మెడలో గంట కట్టేదెవరనే విషయం నా మనసును తొలిచేస్తోంది బావ.

భారతరత్న పీవీ కూడానా..!

జి.నవీన్

రెండవసారి ఐదేళ్ల పదవీకాలం ముగిసే దశలో ప్రధాని నరేంద్ర మోదీ మూడోదఫా అధికారాన్ని నిలుపుకొనేందుకు ఏనాడులేనంత వేగంగా ఐదుగురు విశిష్ట వ్యక్తులకు భారతరత్నలు కురిపించారు. ఇలా ప్రకటించడం ఇదే మొదటిసారి. కొన్ని వారాల్లోనే ఐదుగురికి ఈ అవార్డు ప్రకటించారు. భారతరత్న అవార్డు ప్రవేశపెట్టిన తర్వాత ఏనాడు ఒకేసారి ఇంతమందికి భారత రత్న ప్రకటించలేదు. గాంధీ కుటుంబానికి చెందని కాంగ్రెస్ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అత్యంత విశిష్టమైన భారత రత్నల జాబితాలో చేరారు. 1991-1996లో ఐదేళ్లు ఆయన ప్రధానిగా ఉన్నారు. పదవీకాలం పూర్తిఅయిన ఇన్నేళ్ల తరువాత ఆయన భారతరత్న పొందారు. ప్రధాన మీడియాలో కొన్ని ఈ సంఘటనను ఎంతగానో ప్రశంసించాయి. పీవీ సుదీర్ఘ రాజకీయ జీవితంలో మూడు సంఘటనల్లో కావాలని తప్పులకు పాల్పడ్డారు. ఈ తప్పుల వలన ఆయన రాజకీయ జీవితం ముగిసిపోయింది. చరిత్రలో ఇది అత్యంత అవమానకరం. అయితే, దేశంలో గొప్ప వ్యక్తులకు ఇవి పెద్ద సమస్యలు కాదని చరిత్ర తెలుపుతోంది.

1984లో ఢిల్లీలో జరిగిన దాడులు

ఢిల్లీలో, మరికొన్ని ప్రాంతాల్లో ఆరు కల్లోల రాత్రుల్లో వీధుల్లో సిక్కులను మహాదుర్మార్గంగా ఊచకోత కోశారు. ఈ సందర్భంగా నరసింహారావు హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రధాని ఇందిరాగాంధీని రక్షకభటులు కాల్చిచంపాడు. దీంతో ప్రతీకారం తీర్చుకునేందుకు రెచ్చిపోయిన సమూహాలు సిక్కులను అత్యంత దారుణంగా ఊచకోత కోశారు. హోంశాఖ మంత్రి అయిన నరసింహారావు దేశరక్షణ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అంచనాప్రకారం 3600 మందిని ఊచకోత కోశారు. వాస్తవానికి హత్యకు గురైన వారిసంఖ్య ఢిల్లీలోనే ఇంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఉండవచ్చునని భావించారు. పండితుడు, స్వీయప్రకటిత మేధావి అయిన పీవీ హోంమంత్రిగా ఇంతటి ఘోరకలికి ఎలా అనుమతించారు? 17భాషల్లో మాట్లాడగలిగిన పీవీ సహచర పౌరులపై ఎంతమాత్రం జాలి లేకుండా మౌనంగా ఉండిపోయారు. పీవీని నిరంతరం సమర్థించిన గాంధీయేతర కుటుంబానికి చెందిన కాంగ్రెస్ ప్రధానమంత్రిగా రెండుసార్లు పాలించిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ సిక్కు మతస్థుడు. ఆయన పీవీ నరసింహారావును బహిరంగంగానే హెచ్చరించి సైన్యాన్ని పిలిపించాలని బహిరంగంగానే అనేకమార్లు చెప్పినప్పటికీ ఆయన మాటకూడా ఏ మాత్రం వినిపించుకోలేదు. స్వతంత్ర భారత్ చరిత్రలో ఇది మచ్చగా మిగిలిపోతుంది. 1992 డిసెంబరు 6న అయోధ్యలో బాబ్రీ మసీదును కూలగొట్టిన ఘటనలో పీవీ రెండవసారి నిందితుడుగా నిలిచిపోయారు. అయోధ్యలో రామమందిరం

నిర్మాణాన్ని కోరుతూ ఆనాటి జనసంఘ్(నేటి బీజేపీ) నాయకుడు ఎల్‌కే అడ్వాణీ రథయాత్రను నిలిపివేసేందుకు ఏ మాత్రం ప్రయత్నించలేదు. ఇది బాగా తెలిసిన అంశమే. 500 సంవత్సరాల నాటి మసీదును చివరకు కూల్చివేశారు. అడ్వాణీ రథయాత్ర సందర్భంగా దాదాపు 1000 మంది మృతిచెందారని అంచనా వేశారు. ఈ దుర్ఘటన జరిగి చాలాకాలం అయినప్పటికీ జనంలో ఇంకా గుర్తుండిపోయింది.

అడ్వాణీ రథయాత్రను నిలిపివేసేందుకు ఆయనను అరెస్టుచేసి జైలులో పెట్టారు. లాలూ ప్రసాద్‌యాదవ్ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం ఉన్నప్పటికీ మత ఉద్రిక్తతలను కూడా అనుమతించారు. పీవీకి సన్నిహితంగా ఉన్నవారు, కొంతమంది ఆయన మంత్రివర్గంలో ఉన్నవారు కావాలనే పీవీ చరిత్రలో ఏనాటికీ పరిష్కారంలేని మతాల మధ్య చీలికలను కూడా పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. గత వారంలో లోక్‌సభలో అసదుద్దీన్ ఒవైసీ ప్రసంగిస్తూ, కాషాయగుండాలు బాబ్రీమసీదును కూల్చివేస్తుండగా, ప్రధాని పీవీ పూజచేసుకుంటూ ఎవరికీ అందుబాటులో లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. ఇలా వ్యవహరించిన మొదటి ప్రధానమంత్రి పీవీ అని ఆయన సహచరుడు మణిశంకర్ అయ్యర్ నిందించారు. బాబ్రీ మసీదు కూల్చివేసిన సందర్భంగా బీజేపీని పెద్దగా పట్టించుకోనవసరంలేని అనామక పార్టీగా భావించారు. నేడు నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అసాధారణంగా విస్తరించింది. 2002లో మసీదు కూల్చివేత జరిగిన తర్వాత అడ్వాణీ, పీవీ ఒకే విధమైన పరిపాలకులుగా ప్రచారం పొందారు. నరేంద్ర మోదీ నీరో చక్రవర్తితో పోల్చదగిన పరిపాలకుడుగా ఉన్నారు. పీవీకాలంలో 1992 లో రెండు అత్యంత దుర్మార్గమైన హింసాయుత ఘటనలు చోటుచేసుకున్నాయి. నేటికీ అంతా తలలు వంచుకోవలసిన సంఘటనలుగా దేశచరిత్రలో నిలిచిపోతాయి.

పీవీ చరిత్రలో గుర్తుండిపోయే మరో భిన్నమైన ఘటనకు ప్రతీకగా ఉన్నారు. మూడవ ఘటన కూడా మచ్చగా మిగిలిపోయేదే. 1993 జులైలో పీవీ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయింది. జార్ఖండ్ ముక్తిమోర్చా ఎంపీలకు డబ్బు ఇచ్చి అవిశ్వాస తీర్మానంలో రద్దు కావల్సిన ప్రభుత్వాన్ని కాపాడుకున్నారు. పార్లమెంటులో 14ఓట్లతో మళ్లీ విశ్వాసంపొంది ప్రభుత్వం పడిపోకుండా నిలుపుకున్నారన్న పేరు ఉంది. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఫాలీ నారిమన్ ఇలా వ్యాఖ్యానించారు. "ఈ సంవత్సరం(1993) అవినీతి భారతదేశంలో వ్యవస్థీకృతమైంది. దేశంలోనే పీవీ ప్రభుత్వం తీవ్రమైన అవినీతిలో మునిగిపోయిందనీ, రాజకీయాలనే అవినీతి బాటపట్టించిందనీ, పీవీ సమస్యను సూట్‌కేసులతో సంస్కరించారని కారత్ అన్నారు. లంచం ఇచ్చిన కేసులో పీవీ అంతిమంగా నేరస్థుడని సీబీఐ నిర్ధారించింది. అవినీతికేసులో మూడేళ్లు జైలుశిక్షపడిన మొదటి ప్రధానమంత్రి పీవీనే. అయితే మరింత అప్రతిష్టపాలుకాకుండా సుప్రీంకోర్టు ద్వారా ఊరట పొందారు. ఈ మూడు ఘటనలు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రాజకీయ నాయకుడి రాజ్యాంగ సూత్రాలు వృథా అయ్యాయని నిరూపణ జరిగింది. పీవీ కంటే అధిపత్యం కలిగిన పాలనలో భారతరత్న పొందడం పెద్ద విచిత్రమేమీకాదు.

రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి!

ఈరోజు రైల్లో ప్రయాణం చెయ్యాలంటే ముందుగా రిజర్వేషన్ చేసుకుని వెళ్లాలా?, అప్పటికప్పుడు అనుకొని రైళ్లలో ప్రయాణం చేయటానికి కుదరదా ! పేరుకి వందే మాతరం రైలు, వందే భారత్ రైలు...ఏదో జనం మీద ప్రేమ ఉన్నట్లు స్పెషల్ రైళ్లు. ఇదంతా అంతా బోగస్ ! జనాలను మోసపుచ్చటమే ! గూడూరు నుంచి విజయవాడ ఇంటర్ సిటి నంబరు 12743. ప్రయాణం 4.30 గంటలు. దీనికి ఏసీ కోచ్‌లు అవసరామా !అన్నీ జనరల్ బోగీలు వెయ్యాలి. ఈ రైలుకు రెండో మూడో జనరల్ కోచ్‌లు నడుపుతున్నారు.

ఇ-మెయిల్

ఇవి ప్రయాణికులతో కిట కిట లాడుతుంటాయి. బోగీలో నిలబడిన ప్రయాణికులు పైన పట్టుకోటానికి హ్యాండిల్స్ కూడా ఉండవు. ఊగినపుడు వెళ్లి పక్కవాళ్ల మీద పడిపోతారు. దీనికి పరిష్కారం ఒక్కటే ఏసీ బోగీల స్థానంలో కూడా జనరల్ బోగీలు వేయాలి. బోగీల సంఖ్య పెంచాలి.ముఖ్యంగా రైల్వే అనేది చింతపండు బెల్లం అమ్ముకొనే చిల్లర కొట్టు కాదు అన్న విషయం కేంద్ర ప్రభుత్వం గ్రహించాలి. రైల్వేశాఖ నడిపే రైళ్లలో ఎక్కువ ఏసీ రైళ్లు. అతి పేద దేశంలో ఏసీ రైళ్లు అవసరమా? ఏదో నిమిషాల ప్రకారం, సెకండ్ల ప్రకారం వస్తున్నట్లు టైం టేబుల్ ! వచ్చేది గంట, రెండుగంటల ఆలస్యం. కొన్ని రైళ్లు ఎప్పుడు వస్తాయో చెప్పలేం.

నార్నె వెంకటసుబ్బయ్య

వ్యవసాయ సంక్షోభానికి కారణాలు ఎన్నో!

డా॥ ఎం. సురేష్ బాబు

లక్షలాది మంది రైతులు ట్రాక్టర్లు, ట్రక్కులపై భారత రాజధాని న్యూఢిల్లీ వైపు కవాతు చేస్తున్నారు, తమ ఉత్పత్తులకు హామీ ధరలు, రుణమాఫీ సహా తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు ఢిల్లీలో పెద్ద సమావేశాలను నిషేధించారు. ఇతర ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పంజాబ్, హరియాణా నుంచి రైతులు ఢిల్లీ చలో పేరుతో దేశ రాజధానిని దిగ్బంధనం చేస్తున్నారు. దేశ ఆహారభద్రతకు కేంద్రంగా వ్యవసాయరంగం ఉంది. ప్రస్తుతం ఆ రంగం కుదేలైనందున దానికి సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వ జోక్యాన్ని డిమాండ్ చేస్తున్నందున ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. 2020-2021 నిరసనలలో సంయుక్త కిసాన్ మోర్చా కీలక పాత్ర పోషించింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంతోపాటు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు తిరిగి ఆందోళన ప్రారంభించాల్సివచ్చింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రానున్న లోక్‌సభ ఎన్నికలలో రైతుల ఓట్లను భారీగా పొందేందుకు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తోంది, తప్ప రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంలేదు. మోదీ ప్రభుత్వం గత వారం మాజీ ప్రధాని, వ్యవసాయ నాయకుడు చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ విప్లవానికి మార్గదర్శకుడైన స్వామినాథన్‌కు దేశ అత్యున్నత పౌర గౌరవం భారత రత్నను ప్రకటించింది. చిన్న కమతాలు, కరవు, అనావృష్టి, సరైన నీటి సౌకర్యాలు, ఆధునిక సాగు పద్ధతులు లేకపోవడం వంటి సమస్యలతో భారత వ్యవసాయరంగం దశాబ్దాలుగా అతలాకుతలమౌతోంది. దేశ జనాభాలో సగం మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. కానీ దేశ జీడీపీలో వ్యవసాయం రంగం ద్వారా వచ్చేది కేవలం 15 శాతం మాత్రమే. వ్యవసాయరంగం సంక్షోభానికి కారణాలు అనేకం ఉన్నాయి.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. పంటల దిగుబడి భారీగా పెరిగింది. ఉత్పత్తి పెరగడంతో ఉల్లి, ద్రాక్ష, సోయా, మెంతి, మిర్చి ధరలు భారీగా పతనమయ్యాయి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కనీస మద్దతు ధర కల్పించడంలోనూ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోలేకపోయింది. ప్రభుత్వం రుణ మాఫీ పథకం ఎన్నడూ సరిగా పనిచేసేలా రూపొందించలేదు. అమలు గురించి ప్రశ్న కాదు. పథకం రూపకల్పనలో లోపాలున్నాయి. రుణ మాఫీకి సంబంధించి రెండో విషయం.. అప్పుల్లో అధిక భాగం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల

నుంచి తీసుకున్నవే. కేవలం బ్యాంకు రుణాలకు మాత్రమే ఉద్దేశించిన రుణ మాఫీ ఈ ప్రైవేటు అప్పులకు వర్తించదు. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ అంతకంతకూ సమస్యాత్మకంగా మారుతోంది. ఒకవైపు రుణం పొందడం మరింత ఎక్కువగా కష్టమవుతోంది. 'వ్యవసాయ రుణాలు నేను రెట్టింపు చేశాను... మూడు రెట్లు పెంచాను' అని ప్రణబ్‌ముఖర్జీ నుంచి నిర్మలాసీతారామన్ వరకు ప్రతి ఆర్థికమంత్రీ చెప్పుకుంటారు. ఆ రుణాలు వ్యవసాయదారులకు చేరటం లేదు, వ్యవసాయ వాణిజ్యానికి వెళుతోంది. 2017 సంవత్సరానికి నాబార్డు మహారాష్ట్ర లింక్ క్రెడిట్ ప్రణాళికలో 53 శాతం రుణం ముంబై దాని పరిసరాల్లోని పట్టణ ప్రాంతాలకు కేటాయించింది. ముంబైలో వ్యవసాయ దారులెవరూ లేరు, కానీ వ్యవసాయ వ్యాపారాలున్నాయి. అంటే వ్యవసాయ రుణాల్లో సింహ భాగం వ్యవసాయానికి అందటం లేదు. దీనివల్ల చిన్న రైతులు రుణం పొందటం అంతకంతకూ కష్టమవుతోంది వారు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. నీరవ్ మోదీ, విజయ్ మాల్యా వంటి వారు భారీ మొత్తాల్లో రుణాలు పొందుతారు. కానీ ఒక రైతు రూ. 50 వేల రుణమైనా సులువుగా పొందలేడు. ఈ రుణ మాఫీల ద్వారా మనం నీటి కుళాయి కట్టేయకుండా నేల మీద తడిని తుడుస్తున్నామన్న మాట. అందుకే అది పనిచేయడం లేదు. కనీస మద్దతు ధర అనేది స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సు. ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించటానికి మూడు పద్ధతులున్నాయి. ఎంఎస్‌పీని నిర్ణయించే టప్పుడు... విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారాల వ్యయంతో పాటు కుటుంబ సభ్యుల శ్రమనూ, ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవా లని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసింది. కానీ కేవలం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఖరీదు మాత్రమే ఉండే విధానాన్ని ఎంఎస్‌పీ నిర్ణయానికి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. ఇది కేవలం కంటితుడుపు చర్య మాత్రమే. రైతులకు మేలు చేసేది కాదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ ఆదాయం పెరుగుదల నామ మాత్రంగా ఉంటోందా? వాస్తవికంగా ఉంటోందా? అనేది విస్పష్టంగా చెప్పలేదు. ప్రభుత్వం కేవలం ప్రజలను మభ్యపెట్టే మాటలు మాత్రమే చెప్తోంది.

వ్యవసాయ సంక్షోభం 2014 తర్వాత పెరిగింది నిజమే. కానీ ఇది 2014 లోనే మొదలుకాలేదు. ఇది నూతన సరళీకరణ విధానాలను అమలుచేయటం మొదలైనప్పటి నుంచి 20 ఏళ్లుగా పెరుగుతూ వచ్చిన సంక్షోభం. అయితే 2014 నుంచి ఈ పరిస్థితి మరింతగా దిగజారిందని చెప్పొచ్చు. గత 20 ఏళ్లలో వ్యవసాయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరిన ఉదంతాలున్నాయి. కానీ 2014 నుంచి అది మరింత విషమించిందనేది నిజం. వ్యవసాయం గురించి ఏమాత్రం తెలియని పార్టీ బీజేపీ, నేడు రాజ్యాన్ని నడిపిస్తున్న కార్పొరేట్ రంగం లక్ష్యాన్ని పూర్తి చేయడమే ధ్యేయంగా ఆ పార్టీ ఎంచుకుంది. కార్పొరేట్ రంగానికి ఉత్తమ సేవలు అందించేందుకు బీజేపీ చాలా ముందుంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ మతతత్వం వైపు మళ్లించడానికి బలమైన ప్రయత్నం జరుగుతోంది. సాధారణ ఎన్నికల్లో విభజన సామాజిక-ఆర్థిక విభజన నుంచి సామాజిక-మతతత్వ విభజనకు మారింది, పరిస్థితులు మరింత దిగజారనున్నాయి. ఎన్నికల్లో ఇతర అంశాలు చాలా ఉంటాయి. ప్రతిపక్షం ఏకమవుతుందా లేదా అన్న దాని మీద కూడా ఎన్నికల ఫలితం ఆధారపడి ఉంటుంది. జాతీయ బ్యాంకుల రుణ వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. బ్యాంకులు తమ రుణాలను రైతుల నుంచి మధ్య తరగతికి, ఎగువ మధ్యతరగతికి, నీరవ్ మోదీ వంటి వారికి మళ్లించాయి. నిజానికి గత 20 ఏళ్లలో భారతదేశంలో వ్యవసాయ కుటుంబాలు రెట్టింపయ్యాయి. అంటే వ్యవసాయ రుణాలు పెంచాలి. కానీ ప్రభుత్వం ఆ నిధులను సమాజంలో ధనిక వర్గాలకు ప్రత్యేకించి కార్పొరేట్ రంగానికి మళ్లించింది. వ్యవసాయాన్ని కార్పొరేట్లు స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వాలు సహాయం చేశాయి. నేడు వ్యవసాయంలో కీలకమైన పెట్టుబడి సాధనాలను కార్పొరేట్ రంగం నియంత్రిస్తోంది. బ్యాంకులు తమ రుణాలను రైతులకు బదులుగా కార్పొరేట్ రంగానికి మళ్లిస్తున్నాయి. కార్పొరేట్ రంగం లక్ష్యాలను నెరవేర్చటానికి ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. జాతీయ రైతు కమిషన్ అంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి. వ్యవసాయ సంక్షోభం మీద పూర్తిగా చర్చించటానికి ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి,

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు

ఇది ముమ్మాటికి మోదీ స్కామ్

ఎన్నికల బాండ్ల జారీ రద్దు చేయాలన్న సుప్రీం తీర్పుపై విపక్షాల హర్షాతిరేకం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లు చట్ట విరుద్ధమని, తక్షణమే వాటి జారీని నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సమాచార హక్కు, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛను ఎన్నికల బాండ్లు ఉల్లంఘిస్తున్నాయని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. కాగా సుప్రీంకోర్టుఇచ్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ సహా వివిధ పక్షాలు స్వాగతించాయి.

- సుప్రీం తీర్పుతో నరేంద్ర మోదీ సర్కారు ప్రభుత్వ విధానాలు అవినీతి మయం అని మరోసారి రుజువైందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ కమీషన్లు, లంచం తీసుకుందని ధ్వజమెత్తారు. అది ఈ రోజు నిరూపితం అయిందని పేర్కొన్నారు.
- భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఎన్నికల బాండ్ల పథకాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... నోట్ల కంటే ఓట్లకే శక్తి ఎక్కువ అనే వాస్తవాన్ని ఈ తీర్పు బలపర్చిందన్నారు. 'సుప్రీం ఇచ్చిన తీర్పు బీజేపీని ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెడుతుంది. ప్రధాని మోదీ కుంభకోణం ఎక్కడ ఉంది? ఎక్కడ ఉంది? అని ప్రశ్నిస్తుంటారు. ఇప్పుడు ఆయన ప్రభుత్వం చేసిన పెద్ద స్కామ్ (ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్) మీ కళ్ల ముందే కనిపిస్తుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. చందాలిచ్చే దాతలకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న మోదీ ప్రభుత్వం... అన్నదాతలకు పదే పదే అన్యాయం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. వీవీప్యాట్ల సమస్యలపై రాజకీయ పార్టీలతో సమావేశమయ్యేందుకు ఈసీ ప్రతిసారీ నిరాకరిస్తోందని, ఈ అంశాన్ని కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.
- సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి, పౌరులకు ఆశాకిరణంగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే దీనిని ఏర్పాటు చేశారు. అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ రంగంతోఉన్న సంబంధాలతో అత్యధిక విరాళాలు అందుకుంది. ఐదేళ్లుగా బీజేపీ అందుకున్న విరాళాలు రూ. 5 నుంచి రూ. 6 వేల కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. విరాళాలు ఇచ్చిన వారికి మేలు జరిగి ఉంటుంది. ఇది ఒకవిధంగా క్విడ్ ప్రోకో లాంటిదేనన్నారు. ఇది ముమ్మాటికీ మోదీ ప్రభుత్వ స్కామ్ సిబల్ విమర్శించారు.



- సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇకమీదట మోదీ సర్కారు ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చెయ్యబోదని ఆశిస్తున్నానన్నారు. ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడే ఇది అపారదర్శక, అప్రజాస్వామికమైనదని కాంగ్రెస్ వ్యతిరేకించిందని... 2019 మేనిఫెస్టోలో మోదీ ప్రభుత్వ ఈ అవాస్తవ పథకాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. మోదీ సర్కారు నల్లధన మార్పిడి పథకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీం ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం కూడా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. పారదర్శకతకు దక్కిన గొప్ప విజయంగా అభివర్ణించారు.
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... ఇందుకోసం ఏడేళ్లుగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు లోపల, వెలుపల పోరాడుతోందని... తమ వాదన నిజమని తేలిందన్నారు. నల్లధనం వెలకితీతను ఎన్నికల్లో కీలక ప్రచారాస్త్రంగా చేసుకున్న బీజేపీ... వ్యవస్థ నుండి మొత్తం జవాబుదారీతనాన్ని తొలగించి, నల్లధనాన్ని దాచిపెట్టడానికి అనుమతించే ఒక వ్యవస్థను సృష్టించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు స్వీకరించిన నిధుల వివరాలన్నింటినీ ఎస్‌బిఐ బహిర్గతం చేయాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈసీఐ వాటిని ప్రచురించాలని పార్టీ ఎదురుచూస్తోందని ఖేరా చెప్పారు.
- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు సీపీఎం పేర్కొంది. సుప్రీంకోర్టులోని రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు తమ వాదనను సమర్థించినందుకు సంతోషిస్తున్నామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ పేర్కొన్నారు. ఈ కేసులో సమర్థవంతంగా తమ వాదనలు వినిపించిన షదాన్ ఫర్సాత్, ఇతరులకు అభినందనలు తెలిపారు. అలాగే పార్టీ ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ పథకం అవినీతిని చట్టబద్ధం చేస్తున్నందున ఎన్నికల బాండ్లను అంగీకరించబోమని ప్రారంభంలోనే ప్రకటించాం. ఇతర పిటిషనర్లతో కలిసి సీపీఎం ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసిందని తెలిపింది. 'ఈ పథకానికి వ్యతిరేకంగా పిటిషన్‌లో పేర్కొన్న ప్రధాన వివాదాలు సమర్థించబడటం సంతోషదాయకం. ఎన్నికల నిధుల కోసం సంస్కరణలు ప్రవేశపెట్టడం ఇప్పుడు చాలా అవసరం అని ఆ పార్టీ పేర్కొంది.
- సుప్రీంతీర్పును ఆమ్‌ఆద్మీ స్వాగతించింది. ఎన్నికల విరాళాల విషయంలో పాదర్శకతను నిర్ధారించేందుకు కీలక అడుగు ముందుకుపడిందని తెలిపింది. లేకుంటే ఏపార్టీకి ఏ వ్యక్తి ఎన్ని నిధులు ఇచ్చిందని తెలియదని, దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగేందుకు ఈ విషయాలు తెలియడం ఎంతో అవసరమని దిల్లీ కేబినెట్ మంత్రి అతిషి మీడియా ప్రతినిధులతో అన్నారు.
- బీజేపీకి లబ్ధి కలిగించేందుకే ఎన్నికల బాండ్ల పథకం తీసుకొచ్చారని ఎన్‌సీపీ (శరద్‌పవార్) పేర్కొంది. ఈ విధానంలో ఓ వ్యక్తి లేదా కంపెనీ నుంచి రాజకీయపార్టీకి క్విడ్ ప్రోకో జరుగుతుందనడాన్ని కొట్టిపారేయలేమని, ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్న సుప్రీం తీర్పు అత్యంత హర్షణీయ నిర్ణయమని ఆ పార్టీ అధికార ప్రతినిధి క్రాస్టో అన్నారు.

సుప్రీం కోర్టు మార్గదర్శకాలను లెక్క చేయకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పేర్కొంది.

సుప్రీం తీర్పు ప్రజాస్వామ్యానికి గొప్పవరం

మాజీ ఎన్నికల కమిషనర్లు ఖురేషి, కృష్ణమూర్తి

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు ఎస్‌వై ఖురేషి, టిఎస్ కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి గొప్ప వరం అని ఎస్‌వై ఖురేషి అభిప్రాయపడ్డారు. 'ఇది ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసాన్ని పునరుద్ధరిస్తుంది. ఇది జరగగల గొప్ప విషయం. ఇది గత ఐదు-ఏడేళ్లలో సుప్రీంకోర్టు నుండి మాకు లభించిన అత్యంత చారిత్రాత్మక తీర్పు. ఇది ప్రజాస్వామ్యానికి గొప్ప వరం' అని ఖురేషీ పీటీఐకి తెలిపారు. 'మేమంతా గత చాలా సంవత్సరాలుగా ఆందోళన చెందుతున్నాము. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ దాని గురించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. నేనే అనేక కథనాలు రాశాను. చాలాసార్లు మీడియాతో మాట్లాడాను. మేము లేవనెత్తిన ప్రతి సమస్య తీర్పులో పరిష్కరించబడింది' అని ఆయన అన్నారు. సుప్రీం తీర్పు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని టీఎస్ కృష్ణమూర్తి అభివర్ణించారు. ఇది స్వచ్ఛమైన ప్రజాస్వామ్యానికి దోహదం చేస్తుందన్నారు. సుప్రీం తీర్పుతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకం వల్ల రాజకీయ పార్టీలకందే నిధుల విషయంలో పారదర్శకత కొరవడుతుందని.. ఈ పథకం సరైంది కాదని తాను గతంలో ఎన్నో బహిరంగ ప్రకటనలు చేశానని అన్నారు. వాస్తవానికి ఈ పథకం సరైన పద్ధతి కాదని కృష్ణమూర్తి అన్నారు. అయితే ఇది బ్యాంకింగ్ మార్గంలో జరుగుతున్నందున ఇది పారదర్శకంగా కనిపించినప్పటికీ నిధుల మూలం, దాత పేరు తెలియదన్నారు. అది క్లీన్ మనీ లేదా డర్టీ మనీ అని మీకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. 'ఇది చారిత్రాత్మకమైన తీర్పు... స్వచ్ఛమైన ప్రజాస్వామ్యానికి సంబంధించినది. రాజకీయ పార్టీలు గుణపాఠాలు నేర్చుకుంటాయని నేను ఆశిస్తున్నాను' అని కృష్ణమూర్తి తెలిపారు.

మహాకూటమి కోసమే మా స్థానాన్ని త్యజించాం: దీపాంకర్ భట్టాచార్య

పాట్నా: బీహార్‌లో తమకు చెందిన రాజ్యసభ స్థానాన్ని మహాకూటమి కోసం త్యజించినట్లు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తెలిపారు. రాష్ట్రానికి చెందిన 40 లోక్‌సభ స్థానాల్లో ఐదు కేటాయించాలని కోరారు. మహాకూటమి నుంచి నితీశ్ కుమార్ నిష్క్రమణతో తమ పార్టీ కోసం పెద్ద వాటను కోరనున్నట్లు తెలిపారు. బీహార్ అసెంబ్లీలో సీపీఐ (ఎంఎల్)ఎల్‌కు 12 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశామని, రాజ్యసభ స్థానాన్ని వదులుకున్నామని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనాయకులు కోరడంతో ఆ స్థానాన్ని త్యజించినట్లు భట్టాచార్య అన్నారు. మహాకూటమి తరపు ముగ్గురు అభ్యర్థులకు మద్దతిస్తామని ప్రకటించారు. రాజ్యసభ రేసులో తాను లేనని భట్టాచార్య స్పష్టంచేశారు. ఈ మేరకు వచ్చిన వార్తలు నిరాధారమైనవన్నారు. లోక్‌సభకు పోటీ చేసే స్థానాలపై ఆర్జేడీతో పాటు ప్రతిపక్ష కూటమి నాయకులతో ఒకటి లేక రెండు రోజుల్లో చర్చిస్తామని చెప్పారు. పార్టీ ఎమ్మెల్యే మనోజ్ మంజిల్‌కు భోజ్‌పూర్ జిల్లా కోర్టు మంగళవారం యావజ్జీవ శిక్ష విధించడాన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా భట్టాచార్య విమర్శించారు. బీజేపీ-జేడీయూ తిరిగి ఏకం కావడంతో బీహార్ రాజకీయ వాతావరణం మారిందని, ప్రత్యర్థులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మనోజ్ మంజిల్‌కు శిక్ష విధించడాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అధ్వర్యంలో నిరసనలు జరిగాయి. శుక్రవారం ధర్నాలు జరుగనున్నాయి. 2015 నాటి హత్య కేసులో మంజిల్‌తో పాటు 22 మందికి శిక్ష పడింది. ఇవన్నీ రాజకీయ ప్రేరేపిత కేసులని, మనోజ్ మంజిల్ జైల్లో ఉండే ఎన్నికల్లో పోటీ చేస్తారని, ఆయనకు 30వేలకుపైగా ఓట్లు వస్తాయని భట్టాచార్య దీమాగా చెప్పారు.

టీఎంసీ ఎంపీ మిమీ చక్రవర్తి రాజీనామా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మిమీ చక్రవర్తి తన పదవికి రాజీనామా చేశారు. మిమీ తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి సమర్పించారు. తన సీటుపై టీఎంసీ స్థానిక నాయకత్వం అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మమతా బెనర్జీ జాదవ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి మిమీ చక్రవర్తిని అభ్యర్థిగా ప్రకటించారు. ఆ క్రమంలో మిమీ ఎంపీగా గెలిచారు. అయితే ఇప్పుడు మిమీ ఏ పార్టీలోకి వెళతారనేది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారా లేదా బీజేపీలో చేరతారా అనేది చూడాలి.

ముందుగా ప్రధానితో చర్చించండి

మంత్రుల కమిటీకి రైతునేత పంథేర్ సూచన

న్యూఢిల్లీ/చండీగఢ్: తమ డిమాండ్ల ఆమోదం కోసం రైతులతో కేంద్రం తరపున చర్చలు జరుపుతున్న ముగ్గురు మంత్రుల కమిటీ ముందుగా ప్రధాని నరేంద్రమోదీతో చర్చించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. శంభు సరిహద్దు ప్రాంతంలో 'కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ' ప్రధాన కార్యదర్శి శర్వాన్ సింగ్ పంథేర్ గురువారం మీడియాతో మాట్లాడారు. కేంద్రం తమ డిమాండ్లను అంగీకరించాలని, లేదంటే శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు అనుమతించాలన్నారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో రైతులపై పారామిలటరీ బలగాలు బాష్ప వాయుగోళాలు ప్రయోగించడాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వం తమను బలవంతంగా వెనక్కి పంపాలని చూస్తోందని, అందుకే ఈ ప్రాంతంలో మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసిందని పంథేర్ విమర్శించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనకడుగు వేసే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. పంటకు కనీస మద్దతు ధరతో పాటు ఇతర డిమాండ్లు నెరవేర్చాలని 'దిల్లీ చలో'కు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో పంజాబ్ నుంచి రైతులు శంభు, ఖనౌరీ సరిహద్దు ప్రాంతాలకు చేరుకున్నారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా, వారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున బలగాలు మోహరించింది. బారికేడ్లు, కాంక్రీట్ దిమ్మెలు, ఇనుప ముళ్ల కంచెలు ఏర్పాటు చేసింది. వాటిని తొలగించేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులు బాష్ప వాయుగోళాలు, రబ్బరు బులెట్లు ప్రయోగించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. మరోవైపు 'దిల్లీ చలో' చేపట్టిన రైతులకు మద్దతుగా 'భారతీయ కిసాన్ యూనియన్' పంజాబ్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రైల్ రోకోకు పిలుపునిచ్చింది. దాంతోపాటు టోల్ ప్లాజాల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిరసన చేపట్టాలని 'సంయుక్త కిసాన్ మోర్చా' కోరింది.

ఇది అమృతకాలం కాదు...వినాశకాలం

మోదీ సర్కారుపై దిగ్విజయ్ ధ్వజం



విశాలాంధ్ర-హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తాజాగా మోదీ ప్రభుత్వంపై తారస్థాయిలో విరుచుకుపడ్డారు. నిరసన తెలిపేందుకు రైతులను దిల్లీకి రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దేశంలో అన్నదాతలకు ప్రశ్నించే హక్కు లేకుండా ప్రధాని మోదీ చేశారని ఆరోపించారు. మోదీ కార్పొరేట్లకు మాత్రమే అనుకూలంగా ఉన్నారని, అదానీ లాంటి పారిశ్రామికవేత్తలకు మేలు జరిగే నిర్ణయాలే తీసుకున్నారని దిగ్విజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వానికి దాదాపు పదేళ్లు అయిందని, ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు కొమ్ముకాసిందని దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. ఇది అమృతకాలం కాదని, వినాశకర కాలమని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మోదీ పాలనపై నివేదిక విడుదల చేశామని, ఇందులో ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై ప్రధాని చేసిన అన్యాయాలు పొందుపరిచామని వివరించారు. దేశ రక్షణ విషయంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రక్షణ శాఖ మంత్రి ఒకటి చెప్తే, మోదీ మరొకటి చెబుతారని దుయ్యబట్టారు. ప్రేమను పంచేందుకు రాహుల్ గాంధీ యాత్ర చేస్తుంటే... మోదీ మాత్రం ద్వేషాన్ని పంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసుదైక కుటుంబం తమ ఆలోచన అని, కానీ బీజేపీ దేశ ప్రజలను విభజిస్తోందన్నారు. పీవీ నరసింహారావు కాలంలోనే రామాలయం ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని, ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ మొదటి నుంచి ఆలోచించిందని దిగ్విజయ్ సింగ్ గుర్తు చేశారు. సనాతన ధర్మం ప్రకారం ఆలయ నిర్మాణం పూర్తయ్యాకే ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని, కానీ ఎన్నికల కోడ్ వస్తుందనే ఉద్దేశంతో గుడి నిర్మాణం పూర్తి కాకముందే ప్రాణప్రతిష్ఠ చేశారని మోదీ సర్కారును విమర్శించారు. సతీసమేతంగా కలిసి చేయాల్సిన పూజను మోదీ, మోహన్ భగవత్ ఒక్కొక్కరే నిర్వహించి... సనాతన ధర్మాన్ని కించపరిచారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక మోదీ లాంటి దుర్మార్గ పాలన ఎప్పుడూ చూడలేదన్నారు. మోదీ పాలనలో పేదవాళ్లు మరింత పేదవారిగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారన్నారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడం తమ మొదటి లక్ష్యమని దిగ్విజయ్ సింగ్ చెప్పారు. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని తెలిపారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, భూసేకరణలో అన్నదాతలకు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపణలు గుప్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలను బీజేపీ సర్కార్ నిలవరించలేకపోయిందని విమర్శించారు.

మిమ్ములను జీవితంలో మరువను

రాయ్‌బరేలీ ప్రజలకు సోనియా భావోద్వేగ లేఖ

ప్రియాంక పోటీకి మార్గం సుగమం

న్యూఢిల్లీ: సుదీర్ఘకాలం పాటు లోక్‌సభ సభ్యురాలిగా వ్యవహరించిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఇక రాజ్యసభలో అడుగుపెట్టబోతున్నారు. రాజస్థాన్ నుంచి పెద్దల సభకు వెళ్లేందుకు బుధవారం ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పాతికేళ్లుగా తాను ప్రాతినిధ్యం వహించిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు ఆమె గురువారం భావోద్వేగభరిత లేఖ రాశారు. వయసు, ఆరోగ్య సమస్యల కారణంగానే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని తెలిపారు. అదే సమయంలో ఈ స్థానం నుంచి తన కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా పోటీ గురించి సూచనప్రాయంగా వెల్లడించారు. 'రాయ్‌బరేలీతో మా కుటుంబానికి బలమైన బంధం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో మా మామయ్య ఫిరోజ్ గాంధీని మీరు గెలిపించి దిల్లీకి పంపించారు. ఆ తర్వాత మా అత్తయ్య ఇందిరాగాంధీని మీ సొంతమనిషిలా మార్చేసుకున్నారు. అప్పటి నుంచి ఎన్ని క్లిష్టపరిస్థితులు ఎదురైనా మా కుటుంబంపై మీ ఆప్యాయతను చాటుతూనే ఉన్నారు. కష్టనష్టాల్లో నాకు అండగా నిలిచారు. ఇది ఎన్నటికీ మర్చిపోలేను' అని సోనియా గాంధీ పేర్కొన్నారు. 'మీ వల్లే ఈ రోజు నేను ఇక్కడ ఉన్నాను. కానీ ఇప్పుడు వయసు, ఆరోగ్య సమస్యలు రావడంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేకపోతున్నా. ఈ నిర్ణయంతో మీకు నేరుగా సేవ చేసే అవకాశం లేకపోవచ్చు. అయినా, నా హృదయం ఎల్లప్పుడూ మీతోనే ఉంటుంది. ఇన్నేళ్ల మాదిరిగానే భవిష్యత్తులోనూ నా కుటుంబానికి మీరు మద్దతుగా నిలబడతారని ఆశిస్తున్నా' అని సోనియా అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గాంధీ కుటుంబసభ్యులే పోటీ చేయనున్నట్లు సోనియా సూచనప్రాయంగా వెల్లడించారు. దీంతో అక్కడి నుంచి ప్రియాంక బరిలోకి దిగడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. 1999లో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన సోనియా గాంధీ... యూపీలోని అమేథీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో రాయ్‌బరేలీకి మారారు. నాటి నుంచి ఇప్పటివరకు అదే స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019లో అమేథీలో రాహుల్ గాంధీ ఓటమి చవిచూసినా... సోనియా మాత్రం తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

'ఉపా' నిబంధనల చట్టబద్ధతపై పిటిషన్ల ఉపసంహరణకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా)లోని నిబంధనల చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఉపసంహరించుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. సంబంధిత ఫోరాలను ఆశ్రయించేందుకు అనుమతి కోరుతూ పిటిషన్ల ఉపసంహరణ కోసం పిటిషన్లు చేసిన విజ్ఞప్తిని స్వీకరించింది. ఈ ఆకస్మిక పరిణామం గురువారం చోటుచేసుకుంది. ఎనిమిది పిటిషన్ల ఉపసంహరణకు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిథల్ నేతృత్వ ధర్మాసనం అంగీకరించింది. 'బూటకపు వ్యాజ్యాల'ను అనుమతిచ్చేది లేదని బుధవారం జరిగిన విచారణలో న్యాయస్థానం తేల్చిచెప్పింది. యూఏపీఏ కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు కొట్టివేత కోసం హైకోర్టుకు వెళతారా లేక సర్వోన్నత న్యాయస్థానం విచారణను కోరుకుంటారా అన్నది గురువారంలోగా చెప్పాలని ఆదేశాలిచ్చింది. తాజా విచారణలో ఎనిమిది పిటిషన్ల ఉపసంహరణకు అంగీకారం తెలిపింది. 2021లో సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా రాష్ట్రంలో అల్లర్లను రెచ్చగొట్టినట్లు త్రిపుర పోలీసులు దాఖలు చేసిన ఉపా కేసులో నిందితులైన జర్నలిస్టుతో సహా మూడు పౌర సంఘాల సభ్యుల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. పిటిషన్ల ఉపసంహరణకు అనుమతి కోరారు. 2021, నవంబరు 17న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో అరెస్టు నుంచి రక్షణను రెండు వారాలు పొడిగించాలని ఆదేశించారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అలాంటి ఉత్తర్వులు ఇచ్చేది లేదని జస్టిస్ త్రివేది తేల్చిచెప్పారు. కఠిన చర్యలు తీసుకోవద్దని మౌఖికంగా త్రిపుర పోలీసులకు సూచించారు. 'సాధారణంగా రాజ్యాంగంలోని అధికరణ 32 కింద దాఖలయ్యే ఇటువంటి పిటిషన్లను స్వీకరించం. ఇటువంటి ఆదేశాలివ్వం. ఇప్పుడు ఉత్తర్వుల్లో అలా పేర్కొనడం లేదు కానీ మీరు (త్రిపుర పోలీసులు) మాత్రం ఏమీ చేయొద్దు' అని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హైకోర్టు ఎదుట హాజరుకు అనుమతిని భూషన్ కోరగా హైకోర్టును ఆశ్రయించమని చెప్పారు. 'అన్ని సుప్రీంకోర్టు చూసుకోవాలంటే కుదరదు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణకు హాజరు కావడం లేక ఇతర ఉపశమనాల కోసం హైకోర్టును ఆశ్రయించండి' అని జస్టిస్ త్రివేది తెలిపారు. మీడియా వృత్తిదారుల ఎన్జీవో తరపున పిటిషన్ ఉపసంహరణ దరఖాస్తును స్వీకరించి, అందుకు అనుమతిచ్చారు.

ఈసీ అనూప్ పాండే పదవీ విరమణ

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషనర్ అనుప్ చంద్ర పాండే (65) గురువారం పదవీ విరమణ పొందారు. దీంతో త్రిసభ్య ఎన్నికల కమిషన్‌లో ఖాళీ ఏర్పడింది. పాండే 2021 జూన్‌లో కమిషన్‌లో చేరారు. 37 ఏళ్లు కేంద్రం-యూపీ ప్రభుత్వంలో పనిచేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్న క్రమంలో పాండే పదవీ విరమణ పొందడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, పదవీకాలం, షరతుల) చట్టం ప్రకారం న్యాయ మంత్రి, ఇద్దరు కేంద్ర కార్యదర్శులతో కూడిన సెర్చ్ కమిటీ... ఐదుగురు అభ్యర్థులను ప్రధాని నేతృత్వ సెలక్ట్ కమిటీకి ఎంపిక చేస్తుంది. ఇందుకోసం ఈనెల 7న సెర్చ్ కమిటీ భేటీ కావాల్సి ఉండగా అది వాయిదా పడింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, డీఓపీటీ శాఖ కార్యదర్శిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ నేత, కేంద్ర మంత్రి అధిర్ రంజన్ చౌదరిని సెలక్ట్ కమిటీకి నామినేట్ చేశారు. సెర్చ్ కమిటీ ఎంపిక చేయని వారిని కూడా పరిగణనలోకి తీసుకునే అధికారం సెలక్ట్ కమిటీకి ఉన్నది. సెలక్ట్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఎన్నికల కమిషనర్ లేక ప్రధాన ఎన్నికల కమిషన్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. కొత్త చట్టం రాకముందు సీఈసీ, ఈసీలను ప్రభుత్వ సిఫార్సుల ఆధారంగా నియమించేవారు. కాగా, పాండే, అరుణ్ గోయల్ ఎన్నికల కమిషనర్‌గా, రాజీవ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు.

ఏడుగురు కేంద్రమంత్రులకు దక్కని రాజ్యసభ టికెట్

న్యూఢిల్లీ: త్వరలో రాజ్యసభ పదవీకాలం ముగియనున్న ఏడుగురు కేంద్ర మంత్రులను అధికార బీజేపీ తిరిగి నామినేట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వారిని లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దించవచ్చనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. నామినేట్ చేయని వారిలో ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ (గుజరాత్), విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (మధ్యప్రదేశ్), ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (కర్నాటక), పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ (రాజస్థాన్), మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా (గుజరాత్), సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి నారాయణ్ రాణే ఉన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన సొంత రాష్ట్రం ఒడిశాలోని సంబల్‌పూర్ లేదా ఢేక్నాల్ నుంచి, భూపేందర్ యాదవ్ రాజస్థాన్‌లోని అల్వార్ లేదా మహేంద్రగఢ్ నుంచి, రాజీవ్ చంద్రశేఖర్ బెంగళూరులోని నాలుగు స్థానాల్లో ఒక దాని నుంచి, మాండవీయ గుజరాత్‌లోని భావ్‌నగర్ లేదా సూరత్ నుంచి, రూపాలా రాజ్‌కోట్ నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో రాజ్యసభ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ (ఒడిశా), ఎల్. మురుగన్ (మధ్యప్రదేశ్) మాత్రమే ఉన్నారు. మొత్తానికి 28 మంది రాజ్యసభ ఎంపీలలో కేవలం నలుగురికి మాత్రమే బీజేపీ మరోసారి అవకాశం కల్పించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే 56 స్థానాలకు 28 మంది అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. కొత్త వారికే పార్టీ అధిక ప్రాధాన్యత ఇచ్చింది.

ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తు నాశనం

- 'విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో చంద్రబాబు
- వలంటీర్లు అంటే గౌరవం: పవన్ కల్యాణ్
- స్వేచ్ఛగా మాట్లాడలేని రాజకీయాలు వద్దు: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తు నాశనం అయిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఆలపాటి సురేశ్ కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగింది. టీడీపీ అధినేత చంద్రబాబు పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి ప్రతిని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్‌లాంటి దుర్మార్గుడు వస్తారని తెలిస్తే అమరావతి రైతులు రాజధాని కోసం భూములు ఇచ్చేవారు కాదని అన్నారు. ప్రజారాజధాని కోసం అన్నిఆలయాల్లో పూజలు చేసి అమరావతిని ఏర్పాటు చేస్తే ముక్కోటి దేవతలు కూడా జగన్ నుంచి అమరావతిని కాపాడలేకపోయారని వ్యాఖ్యానించారు. ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తు విధ్వంసమైంది. వైసీపీ అరాచకాలకు తనతో పాటు పవన్ కల్యాణ్, ప్రజలు కూడా బాధితులే అన్నారు. విధ్వంసం అనేది ఒక పుస్తకం కాదని ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న ధర్మాగ్రహంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలనపై పుస్తకం రావడం చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. నియంతపాలనలో ప్రజాస్వామ్యం విధ్వంసమైందన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల మనసులో ఏముందో 185 అంశాలతో ఇందులో స్పష్టంగా రాశారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని సైకో అని పిలుస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని, ఐదేళ్లుగా అమరావతిలో ఆస్తులను విధ్వంస చేశారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో ఆటలాడి ఇప్పుడు నాలుగో రాజధాని అంటున్నారని వ్యాఖ్యానించారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలన్నీ ఎందుకు కలిసి రావాలో తాను చెప్పిన మాటలకు ఈ పుస్తకం ద్వారా అర్థం అవుతుందన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు ఎందుకు చీలకూడదో ఈ పుస్తకంలో వివరించారు. రాష్ట్రంలో 33వేల మంది ఆడపిల్లలు అదృశ్యం అవుతున్నారని తాను చెప్పలేదని కేంద్ర మంత్రి చెప్పటంతో ప్రపంచానికి తెలిసిందన్నారు. వలంటీర్లు సేకరించిన డేటా హైదరాబాద్‌లో మాయం కావటం వల్ల ఇలా జరిగిందన్నారు. వలంటీర్లు అంటే తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. వారి భవిష్యత్తుకు జనసేన కృషి చేస్తుందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రాజధాని సమస్యలు వచ్చినప్పటి నుంచి వామపక్షాలతో టీడీపీ కలిసి పోరాడిందని ఈ మధ్య తెలుగుదేశం వెనుకంజ వేసిందన్నారు. పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించినందుకు ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారని తెలిపారు. స్వేచ్ఛగా మాట్లాడలేని రాజకీయాలు వద్దనేలా ప్రజల్లో మార్పు రావాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే వైసీపీ, టీడీపీ ఎంపీలు కనీసం అర్జీ ఇవ్వలేకపోయారని చెప్పారు. రాష్ట్రంలో లిక్కర్ స్కామ్‌పై టీడీపీ కేంద్రానికి ఫిర్యాదు చేయలేకపోయిందన్నారు. రాష్ట్రంలో విధ్వంస పాలనపై పుస్తకం తీసుకువచ్చిన జర్నలిస్టు సురేష్ కుమార్‌ను అభినందించారు.

సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ రాజకీయాలను ఈసడించుకున్నంత మాత్రనా వాటి ప్రభావం ప్రజలపై లేకుండా పోదన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఎంత విధ్వంసం జరిగిందో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుందన్నారు. ఆర్థిక అంశాల సారాంశమే రాజకీయం అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు అమలు చేసే విధానాలు ప్రజలకు తెలియజేయటం జర్నలిస్టు విధి అన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు ఏ.శివారెడ్డి, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య ప్రసంగించారు. అనంతరం పుస్తక రచయిత ఆలపాటి సురేష్‌కుమార్‌ను అతిథులు ఘనంగా సన్మానించారు.

దొంగ ఓట్లతోనే వైసీపీ గెలిచింది: లోకేశ్



విశాలాంధ్ర-చీపురుపల్లి: తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీ గెలవడానికి దొంగ ఓట్లే కారణమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. దొంగ ఓట్లను అధికారులు పట్టించుకోలేదన్నారు. దొంగ ఓట్లు ఎక్కించిన ఐఏఎస్, డీఎస్పీ, ఎస్సైలు, సీఐలు సస్పెండ్ అయ్యారని గుర్తుచేశారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లిలో కిమిడి నాగార్జున అధ్యక్షతన గురువారం జరిగిన శంఖారావం సభలో లోకేశ్ మాట్లాడారు. 'గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మూడు స్థానాల్లో గెలిచింది. మా ఓట్లు వేరే ఉన్నాయని అప్పట్లో సజ్జల రామకృష్ణ అన్నారు. మా ఓటర్లు ఓటు వేయలేదని చెప్పారు. అప్పట్లో అర్థంకాలేదు కానీ ఇప్పుడు స్పష్టత వచ్చింది. సలహాదారుకు మంగళగిరి, పొన్నూరులో ఓట్లు ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. సీఎం జగన్ 420... ఆయన సలహాదారుడు 820 అని విమర్శించారు. తాను అంబద్కేర్ రాజ్యాంగాన్ని నమ్మితే, జగన్ రాజా రెడ్డి రాజ్యాంగాన్ని నమ్ముకున్నారన్నారు. జగన్ అసమర్థ ముఖ్యమంత్రి అని వ్యాఖ్యానించారు. అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ మంత్రులు తిరుగుతున్నారన్నారు. ఆర్థిక మంత్రి అప్పుల అప్పారావు అని, వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ దొంగని, పిల్ల కాల్వ కూడా తవ్వలేని అరగంట మంత్రి అంబటి రాంబాబు అని విమర్శించారు. విజయనగరానికి ఇచ్చి 50 హామీల్లో జగన్ ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు. భోపాపురం విమానాశ్రయం, రామతీర్థం ప్రాజెక్టు, గోస్తాని-చంపావతి నదుల అనుసంధానం, రామభద్రపురం గడ్డ ఆధునీకరణ, పాలేరు నదిపై డ్యామ్, స్వర్ణముఖి-చిట్టిగడ్డపై బ్రిడ్జి నిర్మాణం జరగలేదని లోకేశ్ అన్నారు. ఉత్తరాంధ్రకు ఒక్క పరిశ్రమైనా తెచ్చారా...ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా. అని ప్రశ్నించారు. పేదల భూములు ఎందుకు బొత్స సత్యనారాయణ కబ్జా చేశారన్నారు. ఇక్కడి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ జిల్లా కోసం పార్లమెంటులో ఏం చేశారు? ఏనాడైనా కేంద్రాన్ని ప్రశ్నించారా? రైల్వేబ్రిడ్జి ఎందుకు పూర్తి చేయలేదు? అని నిలదీశారు. కిమిడి నాగార్జున మాట్లాడుతూ సంక్షేమం పేరుతో ప్రజలను జగన్ మోసగిస్తున్నారన్నారు. ఐదుగురు సామంత రాజులతో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. బొత్స సత్యనారాయణను మించి అవినీతిపరుడు లేడన్నారు. జిల్లాలో మద్యం సిండికేట్లు నడిపిన వ్యక్తి అని ఆరోపించారు. చీపురుపల్లికి ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనసేన సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ-జనసేన కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గద్దె బాబూరావు, లోకం మాధవి, విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల సుగుణాకరరావు, త్రిమూర్తులరాజు పాల్గొన్నారు.

రైతులపై హరియాణా సీఎం అక్కసు

చండీగఢ్: డిమాండ్ల సాధన కోసం దిల్లీ చలో' నిరసన కార్యక్రమం చేపట్టిన రైతులు అనుసరిస్తున్న విధానం సరికాదని హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అక్కసు వెళ్లగక్కారు. సైన్యం తరహాలో దేశ రాజధానిలోకి వెళ్లాలని భావించడం సరైన చర్య కాదని హితవు పలికారు. 'వాళ్లు దిల్లీ వెళ్లడంపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ప్రజలు దేశ రాజధానికి వెళ్లడం రాజ్యాంగం కల్పించిన హక్కు. అందుకు రైళ్లు, బస్సులు, సొంత వాహనాల్లో ప్రయాణించవచ్చు. ట్రాక్టర్లు, ట్రాలీల్లో ఏడాదికి సరిపడా ఆహార పదార్థాలతో రావడం వెనక ఉద్దేశం ఏంటి? వారి కారణంగా సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలు దెబ్బతింటాయని ఎంతోమంది ఆందోళన చెందుతున్నారు. ఏ లక్ష్యంతో చేస్తున్నామనే విషయాన్ని రైతులు ఆలోచించాలి' అని ఖట్టర్ వ్యాఖ్యానించారు.

సందేశ్‌ఖలి లైంగిక వేధింపులపై కమిటీ

కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూదిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ ఖలి లైంగిక వేధింపుల ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. మహిళలపై లైంగిక వేధింపులు, హింసకు సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి నేతృత్వం వహించ నున్నారు. విచారణ, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలతో నివేదికను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కమిటీ అందించనుంది. ప్రతిమా భౌమిక్, సునీతా దుగ్గల్, కవితా పటీదార్, సంగీత యాదవ్, బ్రిజ్‌లాల్ మిగతా సభ్యులుగా ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై వేధింపులు నిత్యకృత్యంగా మారాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలాయని జేపీ నడ్డా ఆరోపించారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బసిర్‌హత్ సబ్‌డివిజన్‌లోని సందేశ్‌ఖలిలో సుకాంత మజుందార్ నేతృత్వంలో బీజేపీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. పోలీసులు, నిరసనకారుల మధ్య జరిగిన ఘర్షణలో మజుందార్‌కు గాయాలయ్యాయి. ఉద్రిక్త పరిస్థితుల నడుమ సందేశ్‌ఖలి సహా చుట్టుపక్కల గ్రామాల్లో సెక్షన్ 144ను అమలు చేసింది.సుందర్‌బన్స్‌లో చిన్న ద్వీపం సందేశ్‌ఖలి. బంగ్లాదేశ సరిహద్దుకు అతి సమీపంలో ఉంటుంది. ఇప్పుడు ఆ ప్రాంతం చర్చనీయాంశంగా మారింది. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు తీవ్రమయ్యాయంటూ స్థానిక మహిళలు ఆరోపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం తీవ్ర కలకలం రేపింది. స్థానికంగా ఉండే తృణమూల్ నేత.. నచ్చిన వారిని పార్టీ ఆఫీసుకు తీసుకెళ్తారని, రాత్రంతా అక్కడే ఉంచి, ఉదయం ఇంటికి పంపిస్తారని ఓ మహిళ ఏడుస్తూ చెప్పే దృశ్యాలు ప్రకంపనలు సృష్టించాయి.

ఈ ఆరోపణల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు షేక్ షాజహాన్. ఆయన ఒక స్థానిక జిల్లా పరిషత్ సభ్యుడు. అత్యాచారాలు, లైంగిక దాడులే కాకుండా తమ భూములు కూడా లాగేసుకున్నారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. తాజా పరిణామాలతో బెంగాల్‌లో రాజకీయ దుమారం చెలరేగింది. సీఎం మమతా బెనర్జీ మౌనంగా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ, వైసీపీయేతర ప్రత్యామ్నాయం అవశ్యం

- బీజేపీతో స్నేహంచేసే పార్టీలు ధ్వంసమే
- టీడీపీ- జనసేన ఆ ప్రమాదం గుర్తించాలి
- సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

విశాలాంధ్రబ్యూరో-కర్నూలు: రాష్ట్రంలో టీడీపీ-వైసీపీయేతర ప్రత్యామ్నాయ శక్తి ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ ఏపార్టీతో స్నేహం చేసినా ఆపార్టీలు ధ్వసమవుతాయని...దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. టీడీపీ- జనసేనలు ఆ ప్రమాదాన్ని గుర్తించాలని హితవు పలికారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళన సమావేశం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీరామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సుధాకర్‌రెడ్డి మిత్రులు, సహచరులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. సురవరం మాట్లాడుతూ అమెరికా తన వద్ద ఉన్న ఆయుధాల అమ్మకాల కోసం దేశాల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. ఇరాన్-ఇరాక్, పలస్తీన - ఇజ్రాయిల్, ఉక్రెయిన్- రష్యా దేశాల మధ్య చిచ్చుపెట్టి యుద్ధాలకు ఉసికొల్పుతోందన్నారు. 2024 ఎన్నికల్లో అభివృది నిరోధకులైన బీజేపీ ఓడించాలన్నారు. దేశసంపద అదాని, అంబానీ లాంటి వారి చేతుల్లో 70 శాతం ఉందన్నారు. కమ్యూనిస్టులు మతాన్ని నమ్మరు కానీ ఏ మతాన్ని ద్వేషించరన్నారు. 2024 ఎన్నికలలో ఓటర్లను మభ్యపెట్టడం కోసమే మోదీ ప్రభుత్వం భారతరత్నలు ప్రకటించిందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన బీపీ మండల్ లాంటి వారికి ఎందుకు భారతరత్న ఇవ్వలేదని ప్రశ్నించారు. బీజేపీ కులాల పేరుతో మతాల పేరుతో మరోసారి ఎన్నికల్లోకి వస్తుందని, అభివృద్ధి చేస్తే 87కోట్ల మందికి ఎందుకు ఉచిత బియ్యం పంపిణీ చేయవలసి వచ్చిందో చెప్పాలన్నారు. బీజేపీని ఎదుర్కోవడానికి కమ్యూనిస్టులు, ప్రాంతీయ పార్టీలు, సెక్యులర్ పార్టీలు కలవాలన్నారు. దేశంలో కాంగ్రెస్‌పార్టీకి 22శాతం ఓటు బ్యాంకు ఉందని, అన్ని సెక్యులర్ పార్టీలు ఆపార్టీ నాయకత్వం కింద పనిచేయాలన్నారు. ఏపీలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ- జనసేన బీజేపీతో అంటకాగుతున్నాయని... ఎవరు గెలిచినా బీజేపీకి మద్దతు ఇస్తారన్నారు. ఈ రెండుపార్టీలు ఓడిపోయి సెక్యులర్‌పార్టీ రావాలని కోరారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్, కమ్యూనిస్టులు లేని భారత దేశం కావాలని కోరుకుంటున్నారని... దేశంలో దోపిడి, అవినీతి ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. ఆత్మీయ సమ్మేళనం ఇంత పెద్దఎత్తున ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ... ఈ కార్యక్రమంలో మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు సురవరం సుధాకర్ రెడ్డికి పెద్దఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీశ్, సీపీఐ సీనియర్ నాయకులు సూర్య నారాయణరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య, డాక్టర్ ఖన్నా, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బస్తిపాడు రామకృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రవిగువేరా, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు సుంకన్న, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులశేఖర్, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, విద్యావంతుల వేదిక నేత భాస్కర్‌రెడ్డి, జనవిజ్ఞానవేదిక నేతలు శేషాద్రి, వలసల రామకృష్ణ, జనసేన నాయకులు హర్షద్, కల్కూర చంద్రశేఖర్, రైతుసంఘం రాష్ట్రనాయకులు కె జగన్నాధం, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలితమ్మ తదితరులు ప్రసంగించారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు వందన సమర్పణ చేశారు.అంతకు ముందు ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ శ్రామిక ఫోరం అధ్యక్షురాలు సురవరం విజయలక్ష్మీ, సురవరం కపిల్, సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, నంద్యాల , కర్నూలు జిల్లా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్, ఎస్ఎన్ రసూల్, మునెప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాష, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్, ధనుంజయ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు అంటే ఏమిటి?

న్యూదిల్లీ: ఎన్నికల బాండ్లు అనేది రాజకీయ పార్టీలకు అనామక నిధులకు అనుమతించే వివాదాస్పద యంత్రాంగం. ఈ బాండ్లు చట్ట విరుద్ధమని, ఇవి సమాచార హక్కుతో పాటు భావ ప్రకటన స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నాయని గురువారం సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడంతో.. వీటి గురించి దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఎన్నికల బాండ్లు వ్యక్తులు లేదా సంస్థలు తమకు నచ్చిన రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే ఆర్థిక పరికరంగా పని చేస్తాయి. రాజకీయ పార్టీలకు నిధుల సహకారం కోసమే ఈ బాండ్‌లను ప్రత్యేకంగా జారీ చేస్తారు. 2017-18 బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వీటిని ప్రవేశపెట్టారు. ఈ బాండ్‌లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేస్తుంది. వీటిని రూ.1,000, రూ.10,000, రూ.1 లక్ష, రూ.10 లక్షలు, రూ.1 కోటి గుణిజాలలో విక్రయిస్తారు. ఈ పథకం కింద చేసే విరాళాలు 100 శాతం పన్ను మినహాయింపు పొందుతాయి. అయితే.. ఎవరైతే విరాళాలు ఇస్తారో వారి వివరాలను బ్యాంక్, రాజకీయ పార్టీలు గోప్యంగా ఉంచుతాయి. ఈ ఎన్నికల బాండ్లను లక్టోరల్ బాండ్లను కేవైసీ ధృవీకరించిన ఖాతాదారులు మాత్రమే కొనుగోలు చేయవచ్చు. ఒక్కసారి డబ్బులు బదిలీ అయిన తర్వాత... రాజకీయ పార్టీలు నిర్ణీత సమయంలోనే ఆ విరాళాలను నగదుగా మార్చుకోవాలి. ఒక వ్యక్తి లేదా సంస్థలు... ఎలాంటి పరిమితులు లేకుండా ఎన్ని బాండ్లు అయినా కొనుగోలు చేయవచ్చు. ఈ పథకంలోని నిబంధనల ప్రకారం... ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29 ఏ కింద రిజిస్టర్ చేయబడిన రాజకీయ పార్టీలు మాత్రమే ఈ బాండ్లు స్వీకరించడానికి అర్హులు. అది కూడా... లోక్‌సభ లేదా రాష్ట్ర శాసనసభకు గత ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఒక శాతం కంటే తక్కువ ఓట్లు సాధించి ఉండకూడదు. ఈ ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నదని సీపీఐ(ఎం), కాంగ్రెస్‌తో పాటు కొన్ని స్వచ్ఛంద సంస్థలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఇది సమాచార హక్కును ఉల్లంఘిస్తుందని, అవినీతిని ప్రోత్సహిస్తుందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఒక రాజకీయ పార్టీ విరాళాలను ఎన్నికల కోసం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చని రాజ్యసభ ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సైతం లేవనెత్తారు. ఈ అంశంపై గతేడాది అక్టోబర్ 31వ తేదీన విచారణ ప్రారంభమైంది. తాజాగా గురువారం ఎన్నికల బాండ్లు చట్ట విరుద్ధమని పేర్కొంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి.

'ఇండియా'కు ఫరూక్ దూరమా?

ఐదు సీట్లలో పోటీ చేస్తామని అబ్దుల్లా వెల్లడి

న్యూదిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ఇండియా కూటమికి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో జయంత్ చౌదరి... పంజాబ్‌లో భగవంత్ మాన్...తాజాగా జమ్మూకశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ఇండియా కూటమికి షాక్ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని మొత్తం ఐదు లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా నిర్ణయించారు. ఇండియా కూటమి ఏర్పాటు సమయం నుంచే ఫరూక్ అబ్దుల్లా చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. అన్ని సమావేశాల్లో పాల్గొన్నారు. ఇంతలోనే ఆయన ఈ నిర్ణయం ప్రకటించడం... కూటమిలో కలకం రేపుతోంది. ఇప్పటికే పశ్చిమబెంగాల్, పంజాబ్, దిల్లీలో ఇండియా కూటమికి ఆప్, టీఎంసీ పార్టీలు దూరమయ్యాయి. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోనూ సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల మధ్య చర్చలు ఫలించేలా కనిపించడం లేదు. ఇంతలో ఫరూక్ అబ్దుల్లా చేసిన ప్రకటన... ఇండియా కూటమి భవిష్యత్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దిల్లీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు ఇవ్వాలని ఆప్ ప్రతిపాదించింది. దిల్లీలో కాంగ్రెస్‌కు ఒక సీటు ఇస్తున్నామని, ఆరు లోక్‌సభ స్థానాల్లో తాము పోటీ చేస్తున్నామని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రకటించారు. ఇండియా కూటమిలో సీట్ల పంపకంలో జాప్యం గురించి సందీప్ పాఠక్ మాట్లాడుతూ తాము కూటమిలోకి వచ్చినప్పుడు, సొంత ప్రయోజనాల గురించి ఆలోచించలేదని, నిజాయతీ, అంకితభావంతో సఖ్యతగా ఉన్నామని సందీప్ పాఠక్ చెప్పారు. కానీ ఇండియా కూటమి లక్ష్యం ఎన్నికల్లో పోటీ చేయడం, దేశానికి ప్రత్యామ్నాయాన్ని అందించడం. సకాలంలో అభ్యర్థులను ప్రకటించడం, ప్రచార వ్యూహం ఖరారు చేయడం కూడా కూటమి చేయాల్సిన ప్రధాన కర్తవ్యమని అన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు

ముందస్తు ఆమోదం తప్పనిసరి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ కమిటీ ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. రాజకీయ ప్రకటనలపై అన్ని రాజకీయ పార్టీలతో గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ, రాష్ట్ర స్థాయిలో ప్రసారం చేయాల్సిన ప్రకటనలకు రాష్ట్ర ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల్లో కమిటీ నిర్ణయిస్తుందని వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని కోరారు. రాష్ట్ర ఎంసీఎంసీ కమిటీ సభ్యుడు, అడిషనల్ సీఈవో కోటేశ్వరరావు, దూరదర్శన్ కేంద్రం విజయవాడ రీజినల్ న్యూస్ యూనిట్ డిప్యూటీ డైరెక్టర్ జి.కొండలరావు, పీఐబీ మీడియా కమ్యూనికేషన్ అధికారి టి.హెన్రీ రాజ్, జాయింట్ సీఈఓ వెంకటేశ్వర రావు, కమిటీ కన్వీనర్, డిప్యూటీ సీఈవో మల్లిబాబు, రాష్ట్రంలో ప్రధాన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సురవరం చేతుల మీదుగా విశాలాంధ్ర జీవిత చందా

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: సీపీఐ కర్నూలు జిల్లా మాజీ కార్యదర్శి పి.భీమలింగప్పవిశాలాంధ్ర జీవిత చందాదారయ్యారు. చందా మొత్తాన్ని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి చేతుల మీదుగా విశాలాంధ్ర సిబ్బందికి అందచేశారు. సురవరం సుధాకరరెడ్డి ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా భీమలింగప్ప విశాలాంధ్ర జీవిత చందా తీసుకున్నారు.

రోహిత్, జడేజా సెంచరీలు

రాజ్‌కోట్: భారత్-ఇంగ్లాండ్ క్రికెట్ జట్ల మధ్య ఇక్కడి సౌరాష్ట్ర స్టేడియంలో గురువారం ప్రారంభమైన మూడో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా చెలరేగారు. సెంచరీలతో దుమ్ములేపిన వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 204 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 33 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టును వీరిద్దరూ ఆదుకున్నారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ-రవీంద్ర జడేజా జోడి చరిత్ర సృష్టించింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో స్వదేశంలో ఇంగ్లాండ్‌పై నాలుగో వికెట్‌కు అత్యధిక పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన జోడీగా నిలిచింది. ఈ క్రమంలో 1985లో చెన్నై వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో నాలుగో వికెట్‌కు మహ్మద్ అజారుద్దీన్-మొహిందర్ అమర్నాథ్ నెలకొల్పిన 190 పరుగుల భాగస్వామ్యం రికార్డును వీరు బద్దలు కొట్టారు. తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తొలిరోజు ఆట ముగిసేసరికి 86 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (131: 196 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సలు), రవీంద్ర జడేజా (110బి:212 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలు) సెంచరీలు సాధించి నాలుగో వికెట్‌కు 204 పరుగులు జోడించారు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టి జాతీయ జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్ (62: 66 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగిపోయాడు. ఐదో బంతికి పరుగుల ఖాతా తెరిచిన సర్ఫరాజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. వన్డే తరహాలో పరుగులు రాబట్టాడు. జడేజాతో కలిసి ఐదో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. అయితే, జడ్డూతో సమన్వయలోపం వల్ల రనౌట్‌గా సర్ఫరాజ్ పెవిలియన్‌కు చేరాడు. ఈ క్రమంలో డగౌట్‌లోని రోహిత్ తీవ్ర అసహనంతో తన క్యాప్‌ను విసిరి కొట్టిన దృశ్యాలు వైరల్‌గా మారాయి.

మళ్లీ తేలిపోయిన గిల్

రెండో టెస్టులో డబుల్ సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్ (10: 10 బంతుల్లో 2 ఫోర్లు) ఈ మ్యాచ్‌లోనూ దూకుడుగానే ఇన్నింగ్స్ ప్రారంభించాడు. కానీ, మార్క్‌వుడ్ పేస్‌కు స్లిప్‌లో దొరికిపోయాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన శుభ్‌మన్ గిల్ (0) మొదటినుంచే అసౌకర్యంగా అనిపించాడు. 9 బంతులు ఎదుర్కొన్నా పరుగుల ఖాతా తెరవలేదు. మార్క్‌వుడ్ బౌలింగ్‌లోనే సరైన ఫుట్‌వర్క్ లేకుండా వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. గత సెంచరీతో ఫామ్ అందుకొన్నాడనుకుంటే మళ్లీ నిరాశపరిచాడు. మరో యువ బ్యాటర్ రజత్ పటీదార్ (5) కూడా ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉండలేదు. టామ్ హార్ట్‌లీ వేసిన బంతిని అంచనా వేయడంలో విఫలమై మిడాఫ్‌లో డకెట్‌కు దొరికిపోయాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.